www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
epaper.aakshitha.com
aashithanews | akshithatelugudaily
బుధవారం, సెప్టెంబర్ 10, 2025 | సంపుటి : 15 సంచిక : 303 | పేజీలు : 10+8, వెల: రూ.5.00 | Nalgonda, Ranga Reddy, Hyderabad, Khammam, Warangal, Mahabub Nagar, Karim Nagar, Amaravathi, Uttarandhra | చీఫ్ ఎడిటర్ : ఎం.దాస్

AKSHITHA TV
ప్రతిక్షణం... ప్రజాపక్షం

AKNR'S Technologies
Software Training with Placement
9493408587
# 109 1st Floor
Annapurna Block, Adithya Enclave, Ameerpet, Hyderabad.
Mulesoft | Python Fullstack
Power-Bi | SQL DBA
Service Now | SAP FI/CO
Devops/Aws/Azure

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్

## ఎన్నికలో మొత్తం 97 శాతం పోలింగ్

### సుదర్శన్ రెడ్డిపై విజయం

### 452 ఓట్లు పొందిన రాధాకృష్ణన్

### సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు







**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపొందారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు ముగియగా, ఓట్ల లెక్కింపు అనంతరం రాత్రి 7:30 గంటలకు ఫలితాలు వెలువరించారు. ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, ఇండీ కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు వచ్చాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికలో మొత్తం 97 శాతం పోలింగ్ నమోద్కెంది. 768 మంది ఎంపీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 13 మంది మినహా మిగతా ఎంపీలంతా ఓటు వేశారు. ఇలా ఉండగా, ఉపరాష్ట్రపతి ఎన్నికల బరిలో అధికార ఎన్‌డిఎ కూటమి నుంచి సీపీ రాధాకృష్ణన్, ఇండీ కూటమి నుంచి బి.సుదర్శన్‌రెడ్డి పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఉపరాష్ట్రపతి మిగతా 2లో..



# అపార నష్టం ఆదుకోండి

### ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు ఆర్థిక సాయమివ్వండి

### రుణాల రీ స్ట్రక్చర్‌కు అనుమతించి భారం తగ్గించండి

### నిర్మలమ్మకు సీఎం రేవంత్ వినతి



**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల సంభవించిన నష్టంపై ఆర్థికమంత్రికి నివేదిక అందజేశారు. ఎంపీలు మల్లు రవి మిగతా 2లో..

# హైకోర్టు తీర్పు గుణపాఠమవ్వాలి



### గ్రూప్-1 పరీక్షలు తిరిగి నిర్వహించాలి

### నిరుద్యోగులకు న్యాయం చేయాలి

### మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక గుణపాఠమని మిగతా 2లో..

## 20 బెడ్స్ కెపాసిటీతో 34 క్యాన్సర్ డే కేర్ సెంటర్లు

### మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి, అక్షిత ప్రతినిధి :** 34 జిల్లాల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ నుంచి అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ వైద్య ఆసుపత్రుల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లను మంత్రి దామోదర రాజనర్సింహ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 బెడ్స్ కెపాసిటీతో 34 సెంటర్స్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. క్యాన్సర్ నివారణకు నోరి దత్తాత్రేయుడి సేవలు మరువలేనివని.. దత్తాత్రేయుడిని ఆరోగ్య శాఖ సలహాదారుగా మిగతా 2లో..




# తొలి ఓటు వేసిన ప్రధాని మోడీ

### వీల్‌చైర్‌లో వచ్చి ఓటేసిన మాజీ ప్రధాని దేవేగౌడ



**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :** నూతన ఉప రాష్ట్రపతి ఎన్నికకు పోలింగ్ ఉదయం ప్రారంభమైంది. మంగళవారం ఉదయం 10 గంటలకు పార్లమెంటు నూతన భవనంలోని వసుధ ఎఫ్ 101లో సందడిగా ప్రారంభమైంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలి ఓటు వేశారు. ఆ వెంటనే ఆయన వరద బాధత రాష్ట్రాల్కైన హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌కు బయలుదేరారు. అనంతరం రాజ్‌నాథ్ సింగ్ తదితరులు ఓటేశారు. పార్లమెంటు ఉభయ సభల ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ క్యూలో నిలబడి ఓటు వేయడం అందర్నీ ఆకట్టుకుంది. కాంగ్రెస్ మిగతా 2లో..

# గ్రూప్-1 ర్యాంకుల నిలిపివేత

### మెయిన్స్ పునఃమూల్యాంకనం చేయాలి

### వెరిఫికేషన్ అయిన అభ్యర్థులకు చుక్కెదురు

### కుదరకపోతే తిరిగి పరీక్ష పెట్టాలి

### తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌కు హైకోర్టు ఆదేశం




**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** గ్రూప్-1 మూల్యాంకనం, ర్యాంకింగ్ లిస్ట్‌పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మార్చి 10న ఇచ్చిన ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. సంజయ్ వర్సెస్ యూపీఎస్సీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పునఃమూల్యాంకనం జరపాలని టీజీపీఎస్సీని ఆదేశించింది. ఈ ప్రక్రియను 8 నెలల్లోపు పూర్తిచేయాలని మిగతా 2లో..




## ఈ-కార్ రేస్ కేసు నివేదిక రెడీ

### స్పీడ్ పెంచిన ఏసీబీ

### గవర్నర్ అనుమతి కోరే అవకాశం

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఏసీబీ స్పీడ్ పెంచింది.ఈ కేసుకు సంబంధించిన నివేదికను ఏసీబీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి ఇవ్వాలని నివేదిక పంపారు. ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి మిగతా 2లో..

## కేసీఆర్ స్ఫూర్తితో జాగృతి పోరు

### సామాజిక తెలంగాణ దిశగా పోరు

### ప్రజల సొమ్మును మేఘాకు దోచిపెట్టారు

### జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరఫున ముందుకు తీసుకెళ్తామని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా జాగృతి కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి మిగతా 2లో..



## నేపాల్ ప్రధాని ఓలి రాజీనామా

### వరుసగా ముగ్గురు మంత్రుల రాజీనామాలు

**ఖాట్మాండు, సెప్టెంబర్ 9 :** బంగ్లాదేశ్ తదుపరి ఇప్పుడు నేపాల్ రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. నేపాల్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తినట్లు తెలుస్తోంది. హిమాలయ దేశం నేపాల్‌లో సామాజిక మాధ్యమాలపై ప్రభుత్వం నిషేధం విధించడాన్ని నిరసిస్తూ ఆ దేశ యువత చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారింది. వేలాది మంది జనరేషన్ జెడ్ ఆందోళనకారులు సోమవారం దేశ రాజధాని మిగతా 2లో..

## 17న స్ఫూర్తిదాయకంగా తెలంగాణ ప్రజాపాలన

### గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద సీఎం నివాళులు

### పబ్లిక్ గార్డెన్‌లో ప్రజాపాలన వేడుక

### సీఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** ఈ నెల 17వ తేదీన నిర్వహించే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సంబంధిత అధికారులను మిగతా 2లో..

## హిమాచల్‌కు రూ.1500 కోట్లు

### వరద ప్రాంతాల్లో ప్రధాని ఏరియల్ సర్వే



**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :** భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన హిమాచల్ ప్రదేశ్ కు తక్షణ సాయం కింద ప్రధాని మోదీ రూ.1500 కోట్ల సాయం ప్రకటించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత, కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో పరిస్థితులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. ఈ క్రమంలోనే మృతుల మిగతా 2లో..

www.akshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY


## ప్రజాకవి కాళోజికి సీఎం రేవంత్ నివాళి



**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. ఢిల్లీలోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయనతో పాటు పలువురు ఎంపీలు. కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు వెళ్ళారు.

## నేపాల్ ప్రధాని ఓలి రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

కాఠ్మాండులో చేపట్టిన ఉద్యమం రణరంగాన్ని తలపించింది. ఈ నిరసనల్లో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. 300 మందికిపైగా గాయపడ్డారు. యువత హింసాత్మక నిరసనల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల నిషేధంపై నేపాల్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సాప్‌తో సహా 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను నిషేధిస్తూ ఈ నెల 4న తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది. అయినప్పటికీ నిరసనలు చల్లారట్లేదు. మరోవైపు రాజధాని సహా పలు ప్రధాన నగరాల్లో సైన్యం మోహరించింది. ఆ దేశ ప్రధాని కేపీ ఓలి రాజకీయ సంక్షోభంలో ఇరుక్కున్నారు. ఇప్పటికే పలువురు కేబినెట్ మంత్రులు రాజీనామా చేశారు. హోంమంత్రి రమేష్ లేఖక్ అధికారికంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కేబినెట్ సమావేశంలో లేఖక్ తన రాజీనామాను ప్రధాని ఓలికి సమర్పించారు. ఆ తర్వాత వ్యవసాయ శాఖ మంత్రి రామ్‌నాథ్ అధికారి, ఆరోగ్య శాఖ మంత్రి ప్రదీప్ పౌడేల్ కూడా తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో నేపాల్‌లో రాజకీయ సంక్షోభం నెలకొనే పరిస్థితి తలెత్తింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో నేపాల్ ప్రధాని కేపీ ఓలి దేశం విడిచి పారిపోయేందుకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన దుబాయ్ కి వెళ్లేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం. హిమాలయ ఎయిర్‌లైన్స్ అనే ప్రైవేట్ విమానయాన సంస్థకు చెందిన ఫ్లైట్ లో ఆయన దుబాయ్ వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఆయన ఇప్పటికే ఉప ప్రధాన మంత్రికి తాత్కాలిక బాధ్యతలు కూడా అప్పగించినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అయితే, ఓలి వైద్య చికిత్స నిమిత్తం దుబాయ్ వెళ్తున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 4వ తేదీన నేపాల్ ప్రభుత్వం సోషల్ మీడియాపై నిషేధం విధించింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సోషల్ మీడియా మద్దతుదారులు ఆందోళనలకు పిలుపునిచ్చారు. వారి పిలుపుమేరకు యువత సోమవారం భారీ ఎత్తున నిరసనలు నిర్వహించారు. ఆ దేశాధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాని నివాసాలను చుట్టుముట్టారు. దీంతో పోలీసులు కాల్పులు జరపడంతో 19 మంది మృతి చెందారు. అయినప్పటికీ.. నేపాల్ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. రెండోరోజు మంగళవారం కూడా పెద్దఎత్తున యువత వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచే పార్లమెంటు వెలుపల రోడ్లని ఆందోళనకారులు నిర్బంధించారు. కలంకి వంటి ప్రాంతాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఆందోళనకారులు రోడ్లను నిర్బంధించారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం మంగళవారం నేపాల్‌లోని భారత పౌరులకు కీలక సూచన జారీ చేసింది. భారత విదేశాంగ శాఖ అధికారిక ప్రకటనలో నేపాల్‌లోని పరిస్థితిని గమనిస్తున్నామని తెలిపింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలు, నిబంధనలను పాటించాలని తెలిపింది. ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరు సహనంతో వ్యవహరించి, సమస్యలను శాంతియుతంగా, చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఆశిస్తున్నామని వెల్లడించింది. దీంతో పాటు మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు వెల్లడించింది. అత్యవసర ప్రయాణాలు తప్పించి, నిరసనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరింది. శాంతియుత వాతావరణం తిరిగి నెలకొనేంతవరకూ జాగ్రత్తలు తీసుకోవాలని విదేశాంగశాఖ కోరింది. నేపాల్‌లో ఉన్న భారతీయ పౌరుల భద్రతే ప్రధానం అన్న నమ్మకంతో ఈ అడ్వైజరీని జారీ చేసింది. మొదట్లో ఈ ప్రదర్శనలు శాంతియుతంగానే జరిగాయి. కానీ, కొందరు ఆందోళనకారులు పోలీసు బ్యారికేడ్‌లను దాటి నిషేధిత పార్లమెంట్ ప్రాంతాల్లోకి వెళ్లారు. అక్కడ కొంతమంది నీటి బాటిళ్లు, చెట్ల కొమ్మలు పోలీసుల విరీదకు విసిరారు. దాంతో పోలీసులు టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లతో స్పందించారు. ఒక దశలో పోలీసులు తట్టుకోలేక పార్లమెంట్ కాంపౌండ్‌లోకి వెనక్కి వెళ్లిపోయారు. ఈ గొడవలో 19 మంది చనిపోయారు. దీంతో ప్రభుత్వం పార్లమెంట్, ముఖ్య కార్యాలయాలు, రాష్ట్రపతి భవనం చుట్టూ కర్ఫ్యూ విధించింది.

## 17న స్ఫూర్తిదాయకంగా తెలంగాణ ప్రజాపాలన

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్లపై నేడు డా.బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో నేడు ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవీ గుప్తా, డీజీపీ డా. జితేందర్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సీవీ ఆనంద్, ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీ శివధర్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు తదితరులు హాజరయ్యారు.

ఈ సమావేశంలో సిఎస్. రామకృష్ణారావు మాట్లాడుతూ, ఈనెల 17 తేదీన ఉదయం గన్‌పార్క్ లోని అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్ లో జరిగే ప్రజాపాలన దినోత్సవం లో పాల్గొంటారని వివరించారు. గన్-పార్క్ వద్ద జరిగే కార్యక్రమానికి జీ.హెచ్.ఎం.సి కమీషనర్ నోడల్ అధికారిగా ఉంటారని, గన్-పార్క్ కు ఫ్లోరల్ డెకరేషన్ తో పాటు, షామియానా తదితర ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా నగరంలోని అని ప్రధాన కార్యాలయాలు, విగ్రహాలు, పర్యాటక ప్రదేశాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని అన్నారు. పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే సమావేశానికి తగు ఏర్పాట్లను చేపట్టాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిదాయకంగా జరిగేలా చూడాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు తగు తాగునీరు, శానిటేషన్ ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి వీవీఐపీలతో పాటు ప్రజాప్రతిధులందరికీ ఆహ్వాన పత్రికలను అందచేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి ఫైర్ సర్వీసుల డీజీ నాగిరెడ్డి, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, ప్రోటోకాల్ శాఖ డైరెక్టర్ శివలింగయ్య, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక, ఎస్పిడీసీఎల్ ఎండి ముషారఫ్, జలమండలి ఎండి అశోక్ రెడ్డి తదితర అధికారులు హాజరయ్యారు.

## గ్రూప్-1 ర్యాంకుల నిలిపివేత




(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు స్పష్టం చేసింది. ఇలా చేయని పక్షంలో మెయిన్స్ పరీక్షలు రద్దు చేయాల్సి వస్తుందని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. గ్రూప్-1 మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని, పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ కొందరు.. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయి ఉత్తర్వుల దశలో ఉన్న పరీక్షలను రద్దు చేయరాదంటూ ఎంపికైన అభ్యర్థులు మరికొందరు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై జూలై 7న న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు వాదనలు విన్నారు. ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించారు. పునఃమూల్యాంకనం సాధ్యం కాకపోతే ఎనిమిది నెలల్లో మళ్లీ మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన అభ్యర్థులకు చుక్కెదురైనట్లయింది. ఈ పిటీషన్లపై జూలై 7న వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది. 2023 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 21 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ ఈ ఏడాది మార్చి 10న విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అనేక అనుమానాలు తలెత్తాయి. పరీక్షల్లో జెల్ పెన్నులు వాడటం, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది సెలెక్ట్ కావడం, తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువగా ఎంపిక కావడం, కేవలం 2 సెంటర్ల నుంచే టాపర్లు ఉండటం తదితర అంశాలపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదంపై సుదీర్ఘ విచారణ జరిపిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు తన తీర్పును వాయిదా వేస్తున్నట్టు జూలై 7న ప్రకటించారు. తాజాగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా రీవాల్యుయేషన్ జరిపించాలని టీజీపీఎస్సీని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు.

# అపార నష్టం ఆదుకోండి





(మొదటి పేజీ తరువాయి)

చామల కిరణ్ కుమార్‌రెడ్డి, కె.రఘువీర్‌రెడ్డి, బలరాం నాయక్ తదితరులు సీఎం వెంట ఉన్నారు. రేవంత్‌రెడ్డి దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు , వరదల వల్ల సంభవించిన నష్టానికి సంబంధించి ప్రాథమిక అంచనాలను ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి ఇచ్చింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. తెలంగాణలో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రత్యేక నిధులతో పాటు, రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ భేటీలో రాష్ట్రంలోని వివిధ ఆర్థిక, అభివృద్ధి అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, గత ప్రభుత్వం తీసుకున్న అధిక వడ్డీ రుణాలను రీస్ట్రక్చర్ చేయాలని, అలాగే, తెలంగాణలో విద్యారంగ అభివృద్ధికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. గత ప్రభుత్వం ఇష్టారీతిగా అధిక వడ్డీలకు తీసుకున్న అప్పులు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారాయని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు. ఈ రుణాల చెల్లింపులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వాటిని తిరిగి చెల్లించడానికి లోన్ రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో విద్యారంగం అభివృద్ధికి కేంద్రం అండగా నిలబడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా, యంగ్ ఇండియా స్కూల్స్, ఇతర విద్యా సంస్థల అభివృద్ధికి ...30 వేల కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సుమారు 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే యంగ్ ఇండియా స్కూల్స్ పథకం ముఖ్య ఉద్దేశ్యం. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని, ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని, మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయని ఆయన తెలిపారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందని, మొత్తం 2.70 లక్షల మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో లబ్ధి పొందుతారని చెప్పారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ...21 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అలాగే, రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, మౌలిక వసతుల కల్పనకు ...9 వేల కోట్లు అవసరమని సీఎం తెలిపారు. ఈ నిధుల సమీకరణ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు పరిమితి నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. విద్యా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని కూడా ఆయన కేంద్ర మంత్రిని అభ్యర్థించారు.

## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్

(మొదటి పేజీ తరువాయి)



ఎన్నికల పోరులో అంతిమ విజయం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ నే వరించింది. భారత రాష్ట్ర సమితి, బీజేడీ, శిరోమణి అకాలీదళ్ సభ్యులు ఓటు వేయలేదు. ఉపరాష్ట్రపతి అభ్యర్థులుగా ఎన్డీయే తరఫున సీపీ రాధా కృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి పోటీ చేశారు. పార్లమెంట్ నూతన భవనంలోని 'ఎఫ్-101 వసుధ'లో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. అధికార ఎన్డీయే కూటమి తరపు సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి నుంచి బి.సుదర్శన్ రెడ్డి పోటీలో ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం.. మంగళవారం సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది.. సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టారు. 96 శాతం మంది సభ్యులు ఓటు హక్కువినియోగించుకున్నారు. ఎన్నికల సంఘం పార్లమెంట్ భవనం లోపల పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసింది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపరాష్ట్రపతిని పార్లమెంటు ఉభయ సభల సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ఎన్నుకుంటుంది. బ్యాలెట్ రహస్య ఓటు- ద్వారా జరుగుతుంది. లెక్కింపు పూర్తయిన తర్వాత సాయంత్రం తర్వాత ఫలితాలు ప్రకటించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఓటింగ్ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. ప్రధానిమోదీ మొదటి ఓటు వేశారు. రహస్య బ్యాలెట్ విధానం ద్వారా నిర్వహించే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పార్లమెంటు సభ్యులు పార్టీ విప్‌లకు కట్టుబడి ఉండరు. ఎన్నికలకు ముందు బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ,కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు రెండూ తమ ఎంపీలతో ఈ ప్రక్రియ గురించి వారికి వివరించడానికి సమావేశాలు నిర్వహించి మాక్ పోల్స్ నిర్వహించాయి.

## కేసీఆర్ స్ఫూర్తితో జాగృతి పోరు

(మొదటి పేజీ తరువాయి)



ఆమె పూలమాల వేసి నివాళు లర్పించారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగానూ అంజలి ఘటించారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. ఉన్నతమైన ఆశయాలతో అడుగు వేయాలని ఆలోచిస్తున్నాం. ఉన్నతమైన లక్ష్యం దిశగా సంప్రదింపులు జరుగుతున్నాయి. సామాజిక తెలంగాణ సాధించే వరకు జాగృతి కార్యకర్తలు విశ్రమించబోరని అన్నారు. సామాజిక తెలంగాణ సాధన కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతాం. కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరపున ముందుకు తీసుకెళ్తాం. కాళోజీ స్ఫూర్తితోనే అందరమూ పని చేశాం.. పని చేస్తాం. ఐలమ్మ స్ఫూర్తితో అందరూ విజృంభించి అన్యాయాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం నాడు ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకొని జాగృతి ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి కవిత నివాళు లర్పించారు. ఇదే సమయంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి కూడా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక తెలంగాణ కోసం తెలంగాణ జాగృతి కృషి చేస్తుందన్నారు. ఉన్నతమైన లక్ష్యంతో ముందుకు వస్తామని.. సామాజిక తెలంగాణ సాధించేవరకు జాగృతి కృషి చేస్తుందని చెప్పారు. అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకు జాగృతి కృషి చేస్తుంద న్నారు. తెలంగాణ సాధనలో బొంత పురుగున్నైనా ముద్దాడుతానన్న కేసీఆర్ స్ఫూర్తితో ముందుకు పోతామని కవిత చెప్పుకొచ్చారు. లెఫ్ట్ టు రైట్ అందర్నీ కులుపుకుని ముందుకు వెళతామన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం మూడోసారి వచ్చుంటే సామాజిక తెలంగాణ కోసం కృషి చేసేవారని కవిత పేర్కొన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకుని రాజకీయంగా ముందుకు వెళతామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు పైనా కీలక కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ నుంచే హైదరాబాద్‌కు తాగునీటి కోసం సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. రూ. 1500 కోట్ల ప్రాజెక్టును రూ. 7,500 కోట్లకు పెంచారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల సొమ్మును మెగా కృష్ణా రెడ్డికి దోచి పెడుతున్నారంటూ కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. కుంభకోణంలో భాగంగానే ప్రాజెక్టు అంచనాలు పెంచారని ఆరోపించారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికపై జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ బిడ్డ సుదర్శన్ రెడ్డి గెలవాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి పదవికి సుదర్శన్ రెడ్డి వన్నె తెస్తారని పేర్కొన్నారు. రాజ్యాంగం పట్ల జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అంకిత భావం ఉందన్నారు.

## తొలి ఓటు వేసిన ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)



జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు జైరామ్ రమేష్, శశిథరూర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ వీల్‌చెర్‌పై పార్లమెంటుకు వచ్చి ఓటు వేశారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, అర్జున్ రామ్ మేఘ్వాల్, కిరణ్ రిజిజు, చిరాగ్ పాశ్వాన్, కిషన్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్ హరివంశ్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్ తదితర ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వివిధ కారణాల రీత్యా ఓటింగ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు భారత్ రాష్ట్ర సమితి, బిజూ జనతాదళ్ , శిరోమణి అకాలీదళ్ ప్రకటించాయి. బీఆర్ఎస్‌కు నలుగురు రాజ్యసభ ఎంపీలు, బీజేడీకి ఏడుగురు రాజ్యసభ ఎంపీలు, శిరోమణి అకాలీదళ్‌కు ఒక ఎంపీ ఉన్నారు. జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఈ ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ పదవి కోసం ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిలు పోటీ పడుతున్నారు. పార్లమెంట్ ఉభయసభలకు ప్రాతినిధ్యం వహించే మొత్తం సభ్యుల సంఖ్య 788 అయినప్పటికీ ఏడు స్థానాలు ఖాళీ కావడం వల్ల ప్రస్తుతం 781 మందే ఉన్నారు. ఎన్డీయేకి 425 మంది సభ్యుల బలం ఉంది. వైకాపా, ఇతర పార్టీల మద్దతు కలిపితే ఆ సంఖ్య 438కి మించే అవకాశం కనిపిస్తోంది. ప్రతిపక్ష కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 314 మంది ఎంపీల మద్దతు ఉంది. ఈ సంఖ్య పెద్దగా మారే సూచనలు లేవు. ఎన్డీయే అభ్యర్థి గెలుపు లాంఛనమని తెలిసినా ప్రతిపక్షాలు ఈ ఎన్నికలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిని రంగంలోకి దించాయి. రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణ కోసం పార్టీలకు అతీతంగా ఆయనకు ఓటేయాలని విస్తృత ప్రచారం చేశాయి. ఎన్డీయే అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ హడావుడి లేకుండా తన పని తాను చేసుకుంటూ వెళ్లారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో రహస్య ఓటింగ్ విధానాన్ని అనుసరిస్తారు. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీలో ఎంపీలు తమకు నచ్చిన వారికి ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. పార్టీలకు అతీతంగా ఎంపీలు ఓటు వినియోగించుకోవాలని విపక్ష అభ్యర్థి ప్రచారం చేయడంతో ఉప రాష్ట్రపతి ఎన్నికపై కాస్త ఉత్కంఠ నెలకొన్న సంగతి తెలిసిందే.

## 20 బెడ్స్ కెపాసిటీతో 34 క్యాన్సర్ డే కేర్ సెంటర్లు

(మొదటి పేజీ తరువాయి)

నియమించుకున్నట్లు చెప్పారు. రేడియేషన్ సెంటర్స్, మొబైల్ కాన్సర్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రతీ గ్రామంలో మొబైల్ కాన్సర్ సెంటర్స్ పని చేస్తాయని పేర్కొన్నారు. జర్మనీ, జపాన్ వెళ్లే స్థాయిలో నర్సులు ఆలోచన చేయాలని సూచించారు. రాబోయే కాలంలో 70 శాతం క్యాన్సర్ పెరగొచ్చు. ముందస్తు స్క్రీనింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి. నర్సింగ్ విద్యార్థులకు ఫారెన్ లాంగ్వేజెస్ లో ట్రైనింగ్ ఇప్పిస్తాం. జపాన్, జర్మనీ భాషల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని.. మన దగ్గర ఏడాదికి 3 వేల మందిని నర్సు లను తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.

## హిమాచల్‌కు రూ.1500 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

బంధువులకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే అనంతరం ప్రధాని మోదీ కాంగ్రాలో ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, గవర్నర్ శివప్రతాప్ శుక్లా తదితరులతో సమావేశమయ్యారు. సహాయక, పునరావాస చర్యలను సమీక్షించారు. నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా వరద బాధితులను పరామర్శించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రం వెన్నంటే ఉంటామని.. వరద ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు అన్ని విధాలా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. సహాయక చర్యల్లో నిమగ్నమైన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, రాష్ట్ర యంత్రాంగం సేవలను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఇదిలా ఉండగా.. వరద నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్ లో పర్యటించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర బృందాల నివేదికలతో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన విజ్ఞప్తుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని మోదీ తెలిపారు. అనంతరం పంజాబ్‌లో పర్యటించారు.

## ఈ-కార్ రేస్ కేసు నివేదిక రెడీ

(మొదటి పేజీ తరువాయి)

అరవింద్‌ను మూడు సార్లు ఏసీబీ ప్రశ్నించింది. అనుమతి రాగానే ఇద్దరిపై ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్టు సమాచారం. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబరు 18న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏ1గా కేటీ-ఆర్, ఏ2గా ఐఏఎస్ అర్విండ్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిపై నమోద్కెంది. 9 నెలల పాటు ఈ కేసును విచారించిన ఏసీబీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ కేసులో కేటీఆర్, ఐఏఎస్ అర్విండ్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కిరణ్ రావు, ఎఫ్ఈఓ లను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి కోసం ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చింది.. గవర్నర్ అనుమతి రాగానే ఫార్ములా ఈ కార్ రేసులో నిందితులపై చార్జ్ షీట్ దాఖలు చేసే అవకాశం ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫార్ములా ఈ కార్ ఈ రేస్ నిర్వహణ సంస్థకు హెచ్ఎండీఏ చెల్లింపులు జరిపింది. అయితే ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించి విదేశీ కంపెనీకి నగదు బదిలీ అయిందని.. దాదాపు రూ.55 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు- ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముగ్గురిపై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చిన సంగతి తెలిసిందే. అయితే, ఈ కారు కేసులో ఫెమా నిబంధనలు ఉల్లఘించినట్టు ఈడీ తెలిపింది.

## హైకోర్టు తీర్పు గుణపాఠమవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నిరుద్యోగ యువతకు న్యాయం లభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు నిజంగా హర్షించదగినది. గతంలో గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయని నిరుద్యోగులు సాక్షాధారాలతో సహా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ, టీఎస్పీఎస్సీ మొండిగా వ్యవహరించింది. నిరుద్యోగుల ఆరోపణలను, వారు లేవనెత్తిన అంశాలను పట్టించుకోకుండా మూర్ఖంగా ముందుకు పోయిందని కేటీఆర్ విమర్శించారు. నిరుద్యోగులు లేవనెత్తిన ఏ అంశాన్ని పట్టించుకోకుండా వారిపై కేసులు పెట్టి, అణచివేతకి, లాఠీఛార్జిలకి గురిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈరోజు హైకోర్టు ఇచ్చిన తీర్పుకు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. ఈరోజు హైకోర్టు తీర్పుతో నిరుద్యోగులకు న్యాయం జరిగిందని, ఇది ముమ్మాటికీ గ్రూప్-1 బాధితుల అలుపెరగని పోరాటానికి దక్కిన గెలుపు అని ఆయన పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల కేటాయింపు, హాల్ టికెట్ల జారీ, పరీక్షా ఫలితాల్లోని అక్రమాల వంటి అనేక ఆరోపణలను, సాక్షాదారులను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతుందని కేటీఆర్ అన్నారు. లోపభూయిష్టమైన పద్ధతులతో పరీక్షలు నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న రేవంత్ రెడ్డి, ఈ కోర్టు తీర్పునకు మీసమాధానం ఏంటి? హడావుడిగా పరీక్షలు నిర్వహించి, అవకతవకలకు పాల్పడిన మీ నిర్లక్ష్య వైఖరికి నేడు విద్యార్థులు నష్టపోతున్నారని ఆయన మండిపడ్డారు. గ్రూప్-1 పరీక్షల్లోని అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడిన బాధితులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి



**దేవిశెట్టి రాజమౌళికి ఘన నివాళులు**

**దేవిశెట్టి శ్రీనివాస్, కుటుంబ సభ్యులు**

**కరీంనగర్, అక్షిత ప్రతినిధి :**

తమ తల్లిదండ్రులు చూపిన మార్గంలో పయనిస్తూ, వారి ఆశయ సాధనకు కృషిచేస్తామని దేవిశెట్టి శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యులు తెలిపారు. వారి తండ్రి స్వర్గీయ దేవిశెట్టి రాజమౌళి పితృయజ్ఞం మంగళవారం కరీంనగర్, గణేష్ నగర్ లోని వారి స్వగృహంలో నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ తండ్రి దేవిశెట్టి రాజమౌళి ఆగస్టు 29 న పరమపదించారని,

అలాగే జనవరి 17 న తమ మాతృ మూర్తి దేవిశెట్టి రాజమణి పరమ పదించారని తెలిపారు. ఈ విధంగా ఒకే ఏడాదిలో తల్లి దండ్రులు ఇరువురిని కోల్పోవడం తమ కుటుంబం లో తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని, వారి మరణం తమకు తీరని లోటని, వారి ఆశయ సాధన కొరకు కృషి చేయటం ఒక్కటే వారికి తామిచ్చే ఘనమైన నివాళి అవుతుందని దేవిశెట్టి శ్రీనివాస్, ఆంజనేయులు, నవీన్ కుమార్, తోట అనితలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐపిఆర్ మాజీ డైరెక్టర్ బి. రాజమౌళి, ప్రముఖ చెస్ట్ ఫిజిషియన్ బి. సుమన్ కుమార్, పలువురు బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని దేవిశెట్టి రాజమౌళికి ఘనంగా నివాళులు అర్పించారు.

## వన్ ఎంప్లాయ్ వన్ ప్లాంట్ కార్యక్రమం

**కొమురవెల్లి అక్షిత న్యూస్:**



కొమురవెల్లి మండలంలోని వన్ ఎంప్లాయ్ వన్ ప్లాంట్ కార్యక్రమంలో భాగంగా కొమురవెల్లి ఎస్ఐ రాజు గౌడ్ మరియు కొమురవెల్లి ఎంపీడీవో తహసిల్దార్ డిప్యూటీ తహసిల్దార్ ఆర్ ఐ లు మరియు రెవెన్యూ సిబ్బందితో కలిసి కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో కేజీబీవీ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలని సిబ్బందికి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు సూచించారు. నేటి మొక్కలే రేపటి వృక్షాలు అని అన్నారు.

## ప్రతిష్టాత్మకంగా వందరోజుల ప్రణాళిక

**నల్గొండ మున్సిపల్ సహాయ కమీషనర్ రవీందర్ రెడ్డి.**

**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వందరోజుల ప్రణాళిక కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని పలు ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలలో శానిటేషన్ డ్రైవ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ మున్సిపల్ సహాయ కమిషనర్ రవీందర్ రెడ్డి రాంనగర్ మున్సిపల్ పార్కులో జరుగుతున్న శానిటేషన్ కార్యక్రమాలను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళిక సందర్భంగా నల్లగొండ పట్టణంలో శానిటేషన్పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చిన్న కాలువలో పెద్ద కాలువలలో మిషన్లో కార్మికులతో కలిసి పూడికతీత పనులు చేపట్టడం జరిగిందన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో చెట్లను నాటి వాటి సంరక్షణ కార్యక్రమాలు చేయడంతో పాటు ఇంటింటికి చెట్లను పంపిణీ చేయడం జరిగింది అన్నారు. అనధికార భవనాలను గుర్తించి వాటికి అస్సైన్మెంట్లు చేసి భువన యాప్ లో వివరాలు పొందుపరచడం జరిగిందన్నారు. అక్రమంగా ఉన్న ట్రేడ్ లైసెన్స్,

నల్లాలను గుర్తించి వాటిని రెగ్యులర్ చేయడం జరిగిందని తెలిపారు. తడి చెత్త పొడి చెత్త హానికర చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలను ఈ ప్రణాళికనే కాకుండా నిరంతరంగా కొనసాగిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు గడ్డం శ్రీనివాస్, నంద్యాల ప్రదీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యానికి కిషోర్ రక్ష

**విద్యతో పాటు మెరుగైన ఆరోగ్యం అందించడం పథకం లక్ష్యం**

**వరంగల్, అక్షిత బ్యూరో:**



నగరంలోని దేశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కిషోర్ రక్ష ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థికి కిషోర రక్ష కార్డును అందించి అందులో వారి ఆరోగ్య స్థితిగతులు పొందుపరిచారు. వారి వైద్య అవసరాలు గుర్తించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్ మాట్లాడుతూ కిశోర రక్ష కార్యక్రమంలో విద్య తో పాటు మంచి ఆరోగ్యం కూడా లభిస్తుందని వారి సమస్యలు నమోదు చేసుకుని వైద్యం అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అఖిల్ డెమో అనిల్, పాఠశాల హెచ్ఎం, సాయి ప్రసాద్, చక్రపాణి, నిశాంత్, ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ జన్ను కోర్నేలు, ఏఎన్ఎం లు తదితరులు పాల్గొన్నారు.

## ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం

**కొమురవెల్లి అక్షిత న్యూస్:**



కొమురవెల్లి మండలంలోని గురువన్న పేట గ్రామం లో ఏక్ పెడ్ మాకేనామ్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి చిలుక కరుణాకర్ మొక్క ని నాటడం జరిగింది. పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ మాట్లాడుతూ గ్రామం లో ఉన్న ప్రతి ఉద్యోగి ఒక్కో మొక్క నాటారు అని తెలపడం జరిగింది. భవిష్యత్ తరాల అభివృద్ధి కి మొక్కలు నాటలని, నాటిన మొక్కలను కాపాడాలని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో వివోఏ లు వెంకట లక్ష్మి, సోని, ఆశ కార్యకర్తలు రాజమణి, నర్సమ్మ , ఉపాధ్యాయులు, గ్రామ సిబ్బంది మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొనడం జరిగింది.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కాళోజి జయంతి వేడుకలు



**నడిగూడెం, అక్షిత న్యూస్:**

స్థానిక కొల్లు లక్ష్మీనరసమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజి గారి 111వ జయంతి వేడుకలను జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డి. విజయ నాయక్ గారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కలయిక. అని యావత్ తెలంగాణకు తెలియజేసిన మహా మేధావి అని, నా గొడవ పుస్తకం ద్వారా పుట్టుక నీది, చావు నీది బ్రతుకంతా సమాజానిది అంటూ సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేసిన ప్రజాకవి మన కాళోజీ అని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ షేక్ .జాన్ పాషా ,కర్నాటి శ్రీధర్ బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని పుట్టినరోజున వృద్ధులకు పండ్లు పంపిణీ



**చేర్యాల అక్షిత ప్రతినిధి:**

చేర్యాల పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు అందే విజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా మంగళ వారం సాల్వాపూర్ గ్రామంలోని వృద్ధులకు, రోగులకు వికలాంగులకు బ్రెడ్- పండ్లను పంపిణీ ని చేయడం జరిగింది. ఈ సందర్భంగా వికలాంగులు మాట్లాడుతూ తమకు విద్యను నేర్పించిన గురువు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందడం మాకు ఎంతో సంతోషాన్ని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మా గురువు ద్వారా మేము స్ఫూర్తిగా పొంది ముందుకు సాగుతున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమం లో బి.నవీన్ కుమార్, ఎం అఖిల, ఎం సుదర్శన్. ఎన్. రాజు, పి. మల్లేశం, ఎన్ తిరుపతి, జి లక్ష్మణ్, ఎం.మల్లికార్జున్, బి. అనిల్, కే .జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

**ఇబ్రహీంపట్నం అక్షిత ప్రతినిధి:**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో మంగళవారం నాడు ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాధిక అధ్యక్షత వహించారు. ప్రధానవక్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖైరతాబాద్ నుండి వచ్చిన ప్రొఫెసర్ గంటా జలంధర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన అన్యాయాన్ని ఎదిరించిన ధిక్కారస్వరం కాళోజి అని తెలిపారు. తెలంగాణ గడ్డపై జరిగిన స్వాతంత్రోద్యమం, గ్రంథాలయ ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాలలో కాళోజీ పాత్ర మరువలేనిదని తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, తెలంగాణ ప్రజల జీవనాడిని తెలుసుకున్న కాళోజి ప్రజల పక్షాన తన కవిత్వాన్ని సరళమైన తెలంగాణ నుడికారంలో రాసి, ప్రజల పక్షాన పోరాడిన ధీరుడని కొనియాడారు. కాళోజీతో దశాబ్ద కాలం పాటు ఆయనతో తిరిగాడిన అనుభవాలను గంటా జలంధర్ రెడ్డి విద్యార్థులతో పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాధిక మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా కాళోజి కృషిని కొనియాడారు. విద్యార్థులు కాళోజి ఆదర్శ భావాలను అందుకొని ముందుకు సాగి జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కే సురేష్ వ్యవహరించగా అధ్యాపకులు కృష్ణ, సురేష్, నరేందర్ రెడ్డి, డాక్టర్ రమేష్, హృదయ రాజు, డాక్టర్ శంకర్, డాక్టర్ పవన్ కుమార్, నర్సింగరావు, కరుణ, వీరారెడ్డి, శ్రీకృష్ణ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# మొబైల్ దొంగతనంతో రూ.6 లక్షల మోసం బోయిన్‌పల్లి

**పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**అక్షిత న్యూస్ / కాప్రా /సికింద్రాబాద్**



బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ, మోసానికి సంబంధించిన కేసు వెలుగుచూసింది. గుర్తు తెలియని దుండగుడు ఒక వ్యక్తి మొబైల్ ఫోన్‌ను దొంగిలించడమే కాకుండా.. ఆ ఫోన్‌లోని డేటాను వాడుకుని రెండు బ్యాంక్ ఖాతాల నుంచి రూ.6 లక్షలకు పైగా నగదును ఖాళీ చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన ప్రసాద్‌రావు బోయిన్‌పల్లిలోని బస్ స్టాప్ వద్ద నాందేడ్‌కు వెళ్లే బస్సు ఎక్కుతుండగా ఈ సంఘటన జరిగింది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆయన మొబైల్ ఫోన్‌ను చప్పుడు కాకుండా దొంగిలించాడు.తరువాత ప్రసాద్‌రావు బోధన్‌లో కొత్త మొబైల్ ఫోన్ కొనుగోలు చేసి.. తన పాత నంబర్‌కు కొత్త సిమ్ తీసుకున్నారు. సిమ్‌ను ఫోన్‌లో ఇన్‌సర్ట్ చేసిన వెంటనే వరుసగా మెసేజ్‌లు వచ్చాయి వాటిలో ఆయన రెండు బ్యాంక్ ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు విత్‌డ్రా అయినట్లు వివరాలు ఉండటంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ప్రసాద్‌రావు వివరాలు పరిశీలించిన పోలీసులు.. రెండు ఖాతాల నుంచి కలిపి రూ.6 లక్షలకు పైగా డబ్బు మాయం అయినట్లు గుర్తించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి.. మొత్తం వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేట్టారు. సీసీటీవీ ఫుటేజ్, బ్యాంక్ లావాదేవీలు, ఫోన్ ట్రాకింగ్ ఆధారాలు పరిశీలిస్తున్నామని చెప్పారు.

# కస్తూర్బా గాంధీ వసతి గృహం

**బాల బాలికలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన..**

**అక్షిత న్యూస్ మునగాల**



వర్షాకాలంలో నీరు కాలుష్యతమై సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని వాటి పట్ల అప్రమతంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు స్రవంతి, రవీందర్ అన్నారు. మంగళవారం మునగాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహం, బాయ్స్ ఎస్సీ హాస్టల్లో విద్యార్థిని, విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు మాట్లాడుతూ. నీరు, ఆహారం, పరిసరాలు కాలుష్యతం కావడం వల్ల విరోచనాలు, టైఫాయిడ్, కామెర్లు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని పరిశుభ్రమైన నీరు శుభ్రమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్లాస్టిక్ డబ్బాలు కొబ్బరి చిప్పలు మురుగునీటి కాలవల్లో నీరు నిలువ ఉండకుండా పరిసరాలలో శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థిని విద్యార్థులకు ఎవరికైనా జ్వరం కానీ ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే మా వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, సురేష్, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖమ్మం ప్రభుత్వ బాలుర వసతి గృహం (బి) లో శిబిరం వైద్య శిబిరం



**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

ప్రభుత్వ బాలుర వసతి గృహం (బి) ఖమ్మం నందు స్థానిక మామిళ్లగూడెం మెడికల్ ఆఫీసర్ యన్.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని అదేవిధంగా చేతి గోళ్ళు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని వర్షాకాలంలో చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది కావున జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. విద్యార్థుల అనారోగ్య సమస్యలు ఉంటే తెలుసుకొని వారికి మందులు పంపిణీ చేశారు. అత్యవసర ప్రాథమిక చికిత్స కి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఎస్ దయామణి వసతి గృహ సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు మరియు నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**చేర్యాల అక్షిత ప్రతినిధి:**

కాళోజి నారాయణ రావు జయంతి పురస్కరించుకొని, మంగళవారం చేర్యాల పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో కాళోజి నారాయణ రావు చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ ఎస్ నాగేందర్ పూలమాలవేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు మరియు వార్డు ఆఫీసర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక

## సంపాదకీయం...

**స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు మొట్టికాయలు వేసింది. సెప్టెంబర్ 30 వరకు ఎన్నికలు జరిపించాలని డెడ్ లైన్ విధించింది. అయినా ప్రభుత్వం ఎన్నికలకు వెళ్ళే పరిస్థితి లేదు. ఇదిగో అదిగో అంటూ కాలయాపన తప్ప కార్యాచరణ లేదు. ఎన్నికలకు సిద్ధం అంటూ ఎన్నికల కమీషన్ అన్ని చర్యలకు ఉపక్రమించినప్పటికి ప్రభుత్వం సాహసించడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీ రిజర్వేషన్ల లొల్లి తారాస్థాయికి చేరింది. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీ రిజర్వేషన్లు ప్రకటిస్తే తప్ప ఎన్నికలకు పోయే ఆలోచన లేదు. కోర్టును ఆశ్రయించి కొంత సమయం అడిగే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్లకై ఇప్పటికే అసెంబ్లీ తీర్మానం చేసి గవర్నర్ కు పంపినప్పటికి అది రాష్ట్రపతి ఆమోదా నికి పంపి చేతులు దులుపుకున్నారు. ఈ విషయమై సాక్షాత్తు సీఎం రేవం త్ రెడ్డి ఆధ్వర్యంలో హస్తినలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసి కేంద్రం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదు. తాజాగా మరోమారు క్యాబినెట్ ఆమోదం...ప్రత్యేక అసెంబ్లీ సమావేశం పెట్టి బీసీ రిజర్వేషన్ల అంశం మళ్ళీ గవర్నర్ కు పంపారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే తప్ప ఎన్నికలకు వెళ్లేలా లేదు.**

# బీసీ రిజర్వేషన్ల లొల్లి

## తేలని "పంచాయతీ"




స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు మొట్టికాయలు వేసింది. సెప్టెంబర్ 30 వరకు ఎన్నికలు జరిపించాలని డెడ్ లైన్ విధించింది. అయినా ప్రభుత్వం ఎన్నికలకు వెళ్ళే పరిస్థితి లేదు. ఇదిగో అదిగో అంటూ కాలయాపన తప్ప కార్యాచరణ లేదు. ఎన్నికలకు సిద్ధం అంటూ ఎన్నికల కమీషన్ అన్ని చర్యలకు ఉపక్రమించినప్పటికి ప్రభుత్వం సాహసించడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీ రిజర్వేషన్ల లొల్లి తారాస్థాయికి చేరింది. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీ రిజర్వేషన్లు ప్రకటిస్తే తప్ప ఎన్నికలకు పోయే ఆలోచన లేదు. కోర్టును ఆశ్రయించి కొంత సమయం అడిగే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్లకై ఇప్పటికే అసెంబ్లీ తీర్మానం చేసి గవర్నర్ కు పంపినప్పటికి అది రాష్ట్రపతి ఆమోదా నికి పంపి చేతులు దులుపుకున్నారు. ఈ విషయమై సాక్షాత్తు సీఎం రేవం త్ రెడ్డి ఆధ్వర్యంలో హస్తినలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసి కేంద్రం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదు. తాజాగా మరోమారు క్యాబినెట్ ఆమోదం...ప్రత్యేక అసెంబ్లీ సమావేశం పెట్టి బీసీ రిజర్వేషన్ల అంశం మళ్ళీ గవర్నర్ కు పంపారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే తప్ప ఎన్నికలకు వెళ్లేలా లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికలు జరగాల్సి ఉంది. తెలంగాణలో మాత్రం ఈ నెలాఖరులోగా నిర్వహించాల ని హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్ల పంచాయితీ తేలకపోవడంతో ప్రభుత్వం వెనకాముందూ ఊగిసలాడుతోంది. ఏపిలో మాత్రం ఇంకా ఎలాంటి అడుగు పడడం లేదు. ఇటీవల పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి ఎన్నిక మాత్రం పెద్ద ఎత్తున జరిపించారు. నిజానికి గ్రామాలను బలోపేతం చేయాలంటే సర్పంచ్‌లే కీలకం. కానీ గ్రామాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వాల కార్యాచరణుండడం లేదు. గ్రామాలను తమ గుప్పిట్లో పెట్టుకుని రాజధాని నుంచి పాలిస్తున్నారు. గ్రామాలు ఆర్థికంగా బలోపేతం కాకుండా ప్రభుత్వాల మీద ఆధారపడాల్సి వస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నది. సీఎం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మెల్లగా అడుగులు వేస్తున్నా.. అనేక జటిల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా పాలన సాగాల్సి ఉంది. అనేక గ్రామీణ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇదే సమయంలో విపక్ష బిఆర్ఎస్ కేవలం విమర్శక పాత్రకే పరిమితం అయ్యింది. తమ పదేళ్ల పాలన వైఫల్యాలపై సమాధానం ఇవ్వడం లేదు. కాళేశ్వరం, ఇ కార్ రేసింగ్, ఫోన్ ట్యాపింగ్ కావచ్చు.. అప్పులు కావచ్చు.. వ్యవస్థలను భ్రష్టు పట్టించడం కావచ్చు.. .ధరణి పేరుతో దోపిడీ కావచ్చు...భూములను చెరపట్టడం కావచ్చు..ఇలా చెప్పుకుంటూ పోతే అనేకానేక సమస్యలపై నిత్యం వస్తున్న విమర్శలను పట్టించుకోకుండా అతి తెలివితో ఎదురుదాడి విమర్శలకు దిగుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ మరో ఎన్నికల సమరానికి తెరలేవనుంది. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలోనే జరుగనున్నాయి. సర్పంచ్, మండలాలు, జడ్పీల ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఈ ఎన్నికలు కూడా అధికార కాంగ్రెస్‌కు, విపక్ష బిజెపి, బిఆర్ఎస్‌లకు కీలకం కానున్నాయి. కిందిస్థాయిలో పట్టు సాధించాలంటే ఈ ఎన్నికల్లో విజయం సాధించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పాలనా తీరులో మార్పు రావాల్సి ఉంది. మూస పాలనకు, తాయిలాలకు దూరంగా ఉండాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యక్రమాలు ఉండాలి. కొత్తగా రేషన్ కార్డులు ఇస్తోన్న ప్రభుత్వం.. ఉన్న రేషన్ కార్డుల్లో నకిలీవెన్ని అన్న గుర్తింపు చేయడం లేదు. రేషన్ కార్డుల ఏరివేత తర్వాతనే కొత్త రేషన్ కార్డులు చేపడితే బాగుండేది. అలాగే బియ్యం ధరలు మండిపోతున్న వేళ..కిలో రూపాయి బియ్యం పథకాన్ని సమీక్షించాలి. రూపాయికి కొత్తిమీర కూడా రాని ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాలన్ని కొనసాగించడం సరికాదు. ఇకపోతే గ్రామీణ అర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా ఉన్న గ్రామాలను అభివృద్ధి పరచి, సర్పంచ్‌లను బాధ్యులను చేసేలా కార్యక్రమాల రచన జరగడం లేదు. గ్రామస్థాయి నుంచి ప్రణాళిక సాగివుంటే గ్రామాలు బాగుపడి రాష్ట్రం, దేశం బాగుపడేది. కానీ అలాంటి ఆలోచన కార్యరూపం దాల్చడం లేదు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలకు వలసలు తగ్గుతాయి. పట్టణాలపై భారం పడదు. గ్రామాల్లో విద్య, వైద్యం, సాగు, తాగునీటి సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించాలి. అన్నీ సచివాలయం నుంచి సీఎంల పర్యవేక్షణలో జరగడం వల్ల గ్రామాలు వట్టిపోవడానికి కారణం అవుతున్నాయి. గ్రామస్థాయిలో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేకపోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతా రహితంగా వ్యవహరించడం వల్ల ఇంతకాలం గ్రామాల్లో పక్కాగా ప్రణాళికలు జరగలేదు. కేంద్రం నేరుగా నిధులు ఇస్తోంది. అయినా వాటిని పక్కదారి పట్టించారు. వివిధ పథకాలతో సర్పంచ్‌లకు బాధ్యత లేకుండా చేస్తున్న పెత్తనాన్ని తగ్గించుకుని, స్థానిక సంస్థలకు రాజీవ్ హయాంలో ఇచ్చి సవరణల ప్రకారం అధికారాలను బదిలీ చేయాలి. సమాంతర వ్యవస్థలను ఏర్పాటు చేయడం సరికాదు. ఏపిలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా గ్రామ సర్పంచ్ వ్యవస్థను గత జగన్ ప్రభుత్వం భ్రష్టు పట్టించింది. సర్పంచ్‌లకు బాధ్యతలు లేకుండా చేయడం సరికాదు. ఎపిలో ఆర్బీకెలతో పెత్తనం సాగించారు. ఎన్నికైన సర్పంచ్‌లను డమ్మీలను చేస్తూ..వారికి నిధులు కేటాయించకుండా..వారిని పనిచేయనీయకుండా పెత్తనం చెలాయించడంతో గ్రామాలు సమగ్ర అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామాలకు ఏమి అవసరమన్నది గుర్తించి నిధులు విడుదల చేసి, అమలు చేయించేలా కార్యాక్రమాలు సాగివుంటే ఆర్థికవ్యవస్థ ఎప్పుడో బలోపేతం అయ్యేది. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడంతో పాటు ప్రణాళికలు సిద్దం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. గ్రామాలను పటిష్ట పాలనా కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి ఉద్యోగులను పనిచేసేలా చేయాలి. అలాగే పనులకు సంబంధించి గ్రామాల్లో తీర్మానం చేయించి అమలు చేయించాలి. సీఎం స్థాయిలో కేవలం పర్యవేక్షణ మాత్రమే ఉండాలి. కార్యక్రమాలునిరంతరాయంగా జరిగేలా అవసరమైతే ప్రణాళికలను అమలు చేయాలి. అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. గ్రామాలను యూనిట్‌గా కార్యక్రమాల రచన సాగాలి. ప్రతి పనికి సర్పంచ్‌లను, గ్రామ వార్డు సభ్యులను బాధ్యులను చేయాలి. అప్పుడే ఏ పథకం అయినా ఆశించన ఫలితం సాధిస్తుంది. అలాగే ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా పారిశుధ్య కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగతమైన శ్రద్ధకు సంబంధించినదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ధ తక్కువనే చెప్పాలి. చెత్తను వీధుల్లో పడేయడం, కాలువల్లో పడేయడం ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై బాధ్యత లేకుండా పోయింది. చెత్త ఎత్తేయడం అధికారుల పని అన్న భావనలో ప్రజలు ఉన్నారు. పారిశుద్ధ్యం, పచ్చదనం, పర్యావరణపై గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగాలి. చైతన్యం చేయాలి. గ్రామస్థాయిలో పనులకు సర్పంచ్‌లను బాధ్యులను చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రతా లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. మురికివాడల వద్ద ఖాళీ ప్రదేశాలు, పొలం ప్రాంతాలు, గ్రామాల శివారు స్థలాలు, రైలు పట్టాల పరిసరాల్లో కాలకృత్యాలు హానికరంగా పరిణమిస్తున్నాయి. చాలా పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెలా వేలాది రూపాయల వేతనాలుగా అందిస్తున్నారు. అయినా మార్పులు కానరావడం లేదు. ఓటు బ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయారయ్యారు. వారిని బాధ్యులను చేసేలా చర్యలు ఉండడం లేదు. సర్పంచ్‌లను, పంచాయితీల పాలక వర్గాలను విశ్వాసంలోకి తీసుకుని వారిని బాధ్యులను చేసినప్పుడే గ్రామాల రూపురేఖలు మారగలవు. పల్లెల ప్రగతితోనే దేశ భవిత సాధ్యం.

## బడుగుల సైదులుకు ఆత్మీయ అభినందన సన్మానం...

కోదాడ అక్షిత ప్రతినిధి



స్థానిక ఎంఎస్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రజా చైతన్య వేదిక సారధ్యంలో " బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత" బడుగుల సైదులును ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో రాయపూడి చిన్ని పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులు పుస్తక పాఠాలతోపాటు జీవిత పాఠాలు నేర్పి, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని, అర్థవంతంగా పాఠాలు బోధించడమే కాదు విద్యార్థుల తల్లిదండ్రులను మనసు లను గెలవాలని, చదువుతోపాటు సంస్కారం విలువలు పై శ్రద్ధ చూపాలని, నేటి సమాజంలో ఉపాధ్యాయులు స్మార్ట్ గా, సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేయాలని ఆ విధంగా పనిచేసిన బాటలో 35 సంవత్సరాల నుండి బడుగుల సైదులు ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో సుదీర్ఘ బోధనా అనుభవంతో పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం, వలన అతని సేవలను గుర్తించి 2017 మండల ఉత్తమ ఉపాధ్యాయ వార్డు,2023 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం జరిగిందని తెలిపినారు. 2024 నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న బడుగుల సైదులు పాఠశాలలో చేసిన బోధన, విద్యా కో కరికులం కార్యక్రమాలు నిర్వహణ,విశిష్ట సేవలకు గుర్తింపు గా 2025 టీచర్స్ డే సందర్భంగా డాక్టర్ పెండెం కృష్ణ కుమార్ ఫౌండేషన్ వారు ఉమ్మడి నల్గొండ జిల్లా "బెస్ట్ టీచర్ అవార్డుకి" ఎంపిక చేసి శాలువా మెమెంటో సర్టిఫికెట్లతో ఘనంగా సన్మానం చేయడం హర్షనీయమని ఆత్మీయ అభినందనలు తెలియజేస్తూ సైదులు ను ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో ముత్తవరపు రామారావు, రాపర్తి రామ నరసయ్య, ఒక్కంతల నరసింహారావు, ఉదయగిరి, కాసాని గురులింగం, చలిగంటి రామారావు ,మొగిలిచర్ల అంజయ్య, మావిడి రామారావు తదితరులు పాల్గొని అభినందించారు.

## కవి కాళోజికి ఘన నివాళి... విజ్ డమ్ హైస్కూల్‌లో భాషా దినోత్సవం

నర్సంపేట అక్షిత ప్రతిని :



తెలంగాణ భాషా, సంస్కృతి, ఆచార వ్యవహారాలకు విశేష ప్రాధాన్యతనిచ్చి, ప్రజల్లో చైతన్యం తెచ్చిన ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని విజ్ డమ్ హైస్కూల్‌లో తెలంగాణ భాషా దినోత్సవం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కాళోజి సేవలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల డైరెక్టర్ జావేద్ మాట్లాడుతూ, కాళోజి తన సాహిత్యం ద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని, రాజకీయ, సామాజిక చైతన్యాన్ని ప్రజల్లో నింపారని పేర్కొన్నారు. "అక్షరాలు అగ్నిగుండాలుగా మారిన ఆయన కవిత్వం, తెలంగాణ ప్రజల ఆవేదనకు, పోరాట స్ఫూర్తికి అద్దం పట్టింది" అని ఆయన కొనియాడారు. విద్యార్థులు ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని కోరారు. సీనియర్ తెలుగు ఉపాధ్యాయుడు రాము మాట్లాడుతూ, కాళోజి కేవలం కవి మాత్రమే కాదని, ఆయన ఒక సామాజిక తత్వవేత్త, ప్రజాస్వామ్యవాది అని చెప్పారు. నిరక్షరాస్యుల గొంతుకను, వారి బాధలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని ప్రశంసించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలు విద్యార్థుల్లో భాషపై ఉన్న ప్రేమను, కాళోజి పట్ల ఉన్న గౌరవాన్ని చాటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ అడ్వైజర్ నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### నల్లబెల్లిలో జూనియర్ అసిస్టెంట్

# ఆత్మహత్యాయత్నం

**నిందితులను శిక్షించాలి**

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి ఆగ్రహం**

నర్సంపేట అక్షిత ప్రతినిధి:






అధికార పార్టీ నాయకుల వేధింపులు భరించలేక నల్లబెల్లి మండలం జూనియర్ అసిస్టెంట్ వాంకుడోతు కల్పన ఆత్మహత్యాయత్నం చేయడంపై మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మార్చుకుని, అక్రమ పనుల కోసం ఉద్యోగులను వేధిస్తున్నారని ఆమె మండిపడ్డారు.

నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ (గతంలో వీఆర్ఏ)గా పనిచేస్తున్న కల్పనను కాంగ్రెస్ నాయకులు




లైంగికంగా వేధించడంతో పాటు, తప్పుడు ధ్రువపత్రాలు ఇవ్వాలని ఒత్తిడి చేశారని ఆరోపణలు వెలువడ్డాయి. ఈ వేధింపులు భరించలేక కల్పన ఆత్మహత్యకు ప్రయత్నించింది, ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటనపై స్పందించిన పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పాల్గొన్నారు.

ధర్నాలో స్వప్న సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. "కల్పన తన ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిని సూసైడ్ నోట్‌లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, పోలీసులు ఇప్పటివరకు కేసు నమోదు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. అధికార పార్టీ నాయకులను కాపాడేందుకే అధికారులు వెనుకాడుతున్నారు" అని ఆరోపించారు. ఒక గిరిజన మహిళా ఉద్యోగిని వేధింపులకు గురై ఆత్మహత్యాయత్నం చేసుకుంటే, ఇప్పటివరకు ఎమ్మెల్యే కానీ, ఉన్నతాధికారులు కానీ స్పందించకపోవడం దారుణమని ఆమె విమర్శించారు.

"కల్పన గతంలోనే ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసినా, ఆయన నిర్లక్ష్యం వహించారు. అంతేకాకుండా, ఆమెను కాంగ్రెస్ నాయకులతో రాజీ పడమని చెప్పి మరింత మానసికంగా కృంగదీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎమ్మార్వోపై కూడా చర్యలు తీసుకోవాలి" అని స్వప్న సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు.

**అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి**

ఈ సందర్భంగా మైనింగ్, మట్టి మాఫియాపై కూడా స్వప్న సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి దందా చేస్తుంటే, రెవెన్యూ అధికారులు, పోలీసులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

కల్పన కేసును సుమోటోగా స్వీకరించి, నిందితులను కఠినంగా శిక్షించి ఆమెకు న్యాయం చేయాలని స్వప్న సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నెక్కొండ మండలంలో యూరియా సరఫరాపై ఉన్నతాధికారుల తనిఖీ

నర్సంపేట, అక్షిత ప్రతినిధి:





నెక్కొండ మండలంలో యూరియా పంపిణీ తీరును పర్యవేక్షించేందుకు వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి కె. అనురాధ, జిల్లా సహకార శాఖ అధికారిణి నీరజ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నెక్కొండ, రెడ్లవాడలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను సందర్శించారు. అక్కడ యూరియా నిల్వలు, బిల్లు పుస్తకాలు, మరియు రైతుల పంటల ఆరోగ్య దీపిక కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ, నెక్కొండ మండలానికి కేటాయించిన యూరియాను కేవలం ఇక్కడి రైతులకు మాత్రమే అందించాలని, అక్రమంగా ఇతర మండలాలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వానాకాలం సీజన్‌లో ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు మండలంలో 2257.995 మెట్రిక్ టన్నుల (50,154 బస్తాలు) యూరియా సరఫరా అయినట్లు తెలిపారు.

రైతులు పంటలకు సూచించిన మోతాదులోనే యూరియా వాడాలని, నానో యూరియాను అన్ని పంటలకు తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఏడీఏ కె. దామోదర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎ. నాగరాజు, పాక్స్ నెక్కొండ సీఈఓ ఎం. సురేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవం

**మన భాష తెలంగాణ, మన యాస తెలంగాణ**

**ఘనంగా కాళోజీ జయంతి**

హుస్నాబాద్ అక్షిత ప్రతినిధి



ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్ నందు మంగళవారం నాడు కాళోజి నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ మన తెలంగాణ భాషను, మన యాసను గర్వంగా మాట్లాడాలి, మనం గౌరవంగా భావించాలి, ఇతరులు అవహేళన చేస్తే చూస్తూ ఊరుకోరాదని పిలుపునిచ్చారు. కాళోజీ నారాయణరావు తెలంగాణ భాషకు, తెలంగాణ ఉద్యమానికి చేసిన కృషిని కొనియాడారు. కొన్ని దశాబ్దాల కాలం నుండి తెలంగాణ భాషను చలనచిత్రం మాధ్యమాలలో పుస్తకాలలో అవహేళన చేస్తూ జరిపిన సాంస్కృతిక దాడిని విద్యార్థులకు వివరించారు.కాళోజీ నారాయణరావు నా గొడవ అంటూ రాసిన కవితలు విద్యార్థులలో స్ఫూర్తి నింపుతాయని విద్యార్థులు తప్పనిసరిగా కాళోజీ నారాయణరావు రచనలను చదివి మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన ఏర్పరచుకోవాలని వివరించారు. అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి , అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి అని అంటూ విద్యార్థిని హర్షవర్ధని, "అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక" అంటూ విద్యార్థి సృజన్ కుమార్ చదివిన కాళోజి కవితలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. నైనా దేవి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ భాషను తెలంగాణ యాసను కాపాడుతామని ప్రతిన పూనారు.

## ద్వారకాపురిలో 11 కె.వి విద్యుత్ లైన్‌తో పేదల ఇక్కట్లు

సత్తుపల్లి, అక్షిత న్యూస్:



సత్తుపల్లి పట్టణం ద్వారకాపురి కాలనీలో 11 కె.వి విద్యుత్ లైన్ అతి తక్కువ ఎత్తులో పేదల ఇళ్ల పైనుండి వెళుతుందని వెంటనే విద్యుత్ శాఖ అధికారులు దీనిని సరిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. ద్వారకాపురి కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు లైను కిందకు రావడం వలన చేతికి అందేంత ఎత్తులోనే విద్యుత్తు ప్రవాహం జరుగుతుందని, దీని వలన ప్రమాదం సంభవించే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే విద్యుత్తు లైను పైకి లేపే ఏర్పాటు చేయాలని, దాంతో పాటు విద్యుత్ స్తంభాలు కూడా పడి పోయే దశలో ఉన్నాయని వాటిని సరిచేసి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ తో ఇంటి పై కప్పు రేకులు పగిలిపోయి, గోడలు పగిలిపోయి ఇళ్లు పడి పోయేందుకు సిద్ధంగా ఉన్నాయని అట్టి ఇళ్లకు ఎన్టీఆర్ కాలనీ, వెంగళరావు నగర్ లో మరమత్తులు చేసినట్లు ఇక్కడ కూడా మరమ్మత్తులు చేయాలని, ఇంకా కాలనీలో ఇళ్ల స్థలాలు లేని పేదలు అనేక మంది ఉన్నారని వారందరికీ ఇళ్ల స్థలాలు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ టౌను సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య ,టౌన్ కమిటీ సభ్యులు ఎర్రజల రాజశేఖర్, కమిటీ అధ్యక్షులు సీమోను కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు దానియేలు, రాజు, వెంకటేశ్వర్లు, పద్మ, సూరయ్య, భాగ్యలక్ష్మి , ఖాసిం ,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# స్వదేశానికి పంత్..

## త్వరలోనే ఫిట్‌నెస్ టెస్టుకు రెడీ..!

**న్యూఢిల్లీ:** భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ స్వదేశం చేరుకున్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన పంత్.. అక్కడి నుంచి ఈమధ్యే ముంబైలో దిగాడు. వైద్య నిపుణులను కలిసిన పంత్ ఆలస్యం చేయకుండా ఫిట్‌నెస్‌పై దృష్టి సారించనున్నాడు. వెస్టిండీస్‌తో జరుగబోయే టెస్టు సిరీస్ లక్ష్యంగా పెట్టుకున్న పంత్ త్వరలోనేబెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరనున్నాడు. ఒకవేళ ఈ సిరీస్‌లోపు ఫిట్‌నెస్ సాధించకుంటే అక్టోబర్–నవంబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు ఈ డాషింగ్









బ్యాటర్ వెళ్లే అవకాశముంది.

గాయం కారణంగా జట్టుకు దూరమైన పంత్ సోషల్ మీడియాలో మాత్రం చురుకుగా ఉంటున్నాడు. త్వరగా కోలుకొని మైదానంలోకి దిగేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా అంటూ పోస్టులు పెడుతున్నాడు. 'నేనొక విషయం అర్థం చేసుకున్నా. గతంలో మీరు ఎంతో బాధ పడి ఉండవచ్చు.. కానీ తాజాగా అయిన గాయం కూడా అంతే బాధిస్తుంది. నొప్పి ఎక్కువనిపించినా సరే కోలుకునేందుకు కష్టపడాల్సిందే. అందుకే పాజిటివ్‌గా ఉండటం చాలా ముఖ్యం. మిమ్మల్ని మీరు మోటివేట్ చేసుకోవడం ఎంతో ఉపయోగపడుతుంది. స్వీయ నమ్మకంతో ఉంటూ.. మీరు జీవించాలనుకున్న దిశగా సాగాలి' అని తన ఆలోచనల్ని పంచుకున్నాడీ వైస్ కెప్టెన్.

'నాకు లభిస్తున్న మీ ప్రేమ, ఆశీస్సులకు ధన్యుడిని. నేను ద్రుఢంగా ఉండడానికి కారణం మీరే. నా పాదం ఎముక గాయం నయం కాగానే రిహాబిలిటేషన్ సెంటర్‌కు వెళ్తాను. ఓపికగా ఉండడం, నిపుణుల సూచలనల్ని పాటించడం, నా నుంచి 100 శాతం కృషి చేయడం, .. ఇవే నా ప్రాధాన్యాలు. దేశం తరఫున ఆడడం నా జీవితంలో ఎల్లప్పుడూ గర్వపడే క్షణమే. నాకెంతో ఇష్టమైన ఆటను మళ్లీ ఆడేందుకు ఆతృతగా ఉన్నాను' అని పంత్ తాజా పోస్ట్‌లో వెల్లడించాడు.

మూడు ఫార్మట్లలో కీలక ఆటగాడైన పంత్ మాంచెస్టర్ టెస్టులో గాయపడ్డాడు. ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడబోగా బంతి అతడి కుడి పాదానికి గట్టిగా తగిలింది. స్కానింగ్ పరీక్షల అనంతరం పాదంలో ఎముక విరిగినట్టు తేలింది. దాంతో.. డగౌట్‌కు చేరిన అతడు తొలి ఇన్నింగ్స్‌లో శార్దూల్ ఠాకూర్ ఔటయ్యాక కుంటుతూనే



క్రీజులోకి వచ్చాడు. 37 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఇన్నింగ్స్ కొనసాగించిన పంత్.. అర్ధ శతకం బాది వెనుదిరిగాడు. అయితే.. గాయం తీవ్రత కారణంగా చివరిదైన ఓవల్ టెస్టుకు పంత్ దూరమయ్యాడు.

## ఆసియాకప్‌లో ఫెవరేట్ ఎవరు?

**దుబాయ్:** ఆసియాకప్ టోర్నీ నేటి నుంచి ప్రారంభం అవుతోంది. ఈ నేపథ్యంలో ఆరు జట్లకు చెందిన కెప్టెన్లతో మీడియా సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో ఓ జర్నలిస్టు టోర్నమెంట్ ఫెవరేట్ ఎవరన్న ప్రశ్న వేశారు. ఆసియా కప్ టోర్నీ టైటిల్‌కు ఇండియా ఫెవరేట్‌గా ఉందన్న విషయం నిజమేనా అని ఆయన ప్రశ్న వేశారు. దానికి భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తో పాటు పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా కూడా స్పందించారు. అయితే సూర్య తన సమాధానంతో అందర్నీ స్టన్ చేశాడు. కిస్నే బోలా.. మీకెవరు చెప్పారు.. నేనెప్పుడు వినలేదని అన్నాడు. నాలుగు రోజుల క్రితమే దుబాయ్‌కు చేరుకున్నామని, టోర్నీ గెలవాలన్న కాన్ఫిడెంట్‌తో ఉన్నామని, జట్టుకు మంచి గుర్తింపు వచ్చిందని, టోర్నీలో రాణించనున్నట్లు అతను చెప్పాడు.

ఫెవరేట్స్ ఎవరన్న ప్రశ్నకు పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా కూడా స్పందించారు. టీ20 క్రికెట్‌లో ఏ జట్టు



కూడా ఫెవరేట్‌గా ఉండదన్నారు. ఎందుకంటే ఆట విధానమే అలా ఉంటుందన్నారు. ఇది ఫాస్ట్ పేస్ గేమ్ అని, కొన్ని ఓవర్లలో మ్యాచ్ స్వరూపం మారిపోతుందని సల్మాన్ అన్నాడు. యూఏఈ, ఆఫ్ఘనిస్తాన్‌తో ఇటీవల జరిగిన ట్రై సిరీస్‌లో పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఆసియాకప్‌ను గెలవకుంటే, ట్రై సిరీస్ గెలిచి లాభం లేదని సల్మాన్ తెలిపాడు. ప్రెస్ కాన్ఫరెన్స్ సమయంలో ఇండియా, పాక్ కెప్టెన్లు హ్యాండ్‌షేక్ ఇచ్చుకోలేదు.

## ఆసుపత్రికి వెళ్లిన రోహిత్ శర్మ..

### ఆందోళనలో అభిమానులు..!

**ముంబై:** టీమిండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రికి వెళ్లారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రోహిత్ ఆసుపత్రిలోకి వస్తున్నట్లుగా వీడియోలు, ఫొటోల్లో కనిపించింది. అయితే, రోహిత్ ఆసుపత్రికి ఎందుకు వచ్చాడన్నది మాత్రం తెలియరాలేదు. దాంతో అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. త్వరలో జరుగనున్న ఆస్ట్రేలియా సిరీస్‌కు తిరిగి వన్డే జట్టులోకి చేరుతాడని భావిస్తుండగా.. ఆసుపత్రికి వెళ్లడం షాక్‌కు గురి చేసింది. ఆసుపత్రికి యాజమాన్యం సైతం స్పందించలేదు.

కేవలం సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగానే ఆసుపత్రికి వెళ్లినట్లుగా భావిస్తున్నారు. బిజీ క్రికెట్ షెడ్యూల్‌కు ముందు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం సాధారణమైన విషయమేనని గుర్తు చేస్తున్నారు. అయితే, చాలారోజులుగా మైదానానికి దూరం కాగా.. ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌కు ముందు ఆసుపత్రికి వెళ్లడం అందరినీ షాక్‌కు గురయ్యారు. రోహిత్ చివరిసారిగా చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా తరఫున ఆడాడు. ఐపీఎల్ సమయంలో ముంబయి ఇండియన్స్ తరఫున చివరి మ్యాచ్ ఆడాడు.

ఈ ఏడాది టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. 67 టెస్ట్‌ల్లో 4301 పరుగులకు 40.58



సగటుతో మంచి స్కోరు సాధించిన 38 సీనియర్ బ్యాట్స్‌మెన్.. అంతకు ముందు టీ20లకు వీడ్కోలు పలికాడు. ఈ ఫార్మాట్‌లో భారత్‌కు ఐసీసీ టైటిల్‌ను అందించి.. టీ20లకు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. ఇటీవల సియెట్ ఈవెంట్‌లో పాల్గొని మాట్లాడాడు. టెస్ట్ ఫార్మాట్‌లో ఐదురోజులు ఆడాల్సి ఉంటుందని.. మానసికంగా, శారీరకంగా సవాల్‌తో కూడుకున్నదని తెలిపాడు.




# బిజినెస్ Business

## నో కాస్ట్ ఈఎంఐలో నిజమెంత?

### పండగ ఆఫర్లలో షాపింగ్ చేసేవారికి ఈ జాగ్రత్తలు మస్ట్!

**న్యూఢిల్లీ:** పండుగ కాలంలో అమ్మకాలను పెంచడానికి అనేక సంస్థలు, ఆన్‌లైన్ వ్యాపార వేదికలు నో కాస్ట్ ఈఎంఐ ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. ఈ పథకం కస్టమర్ల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నట్లు కనిపించినా, నిజానికి ఇది పరోక్ష ఖర్చులకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి సంస్థలు పండుగ అమ్మకాలను ప్రారంభించాయి. ఈ రెండు సంస్థలు పోటీపడి కస్టమర్లకు భారీ డిస్కౌంట్లలో వస్తువులను అమ్ముతున్నాయి. అదనంగా, నో కాస్ట్ ఈఎంఐ పేరుతో నెలవారీ వాయిదాలలో కొనుగోలు చేసేవారికి వడ్డీ వసూలు చేయమని ప్రకటిస్తున్నాయి. ఇది కస్టమర్లకు నిజంగా లాభమా అని తెలుసుకుందాం.




### 'నో కాస్ట్ ఈఎంఐ' నిజ స్వరూపం

సాధారణంగా ఒక వస్తువును కొన్నప్పుడు వడ్డీ లేకుండా నెలవారీ వాయిదా వసూలు చేసే పథకమే నో కాస్ట్ ఈఎంఐ. అంటే, మనం కొనే వస్తువుల ధరను వాయిదాలుగా విభజించి చెల్లించవచ్చు. దీనికి ప్రత్యేకంగా వడ్డీ ఏదీ వసూలు చేయరు. కానీ, ఇలా కొనడం ఎల్లప్పుడూ లాభదాయకం కాదు. వడ్డీ వసూలు చేయమని చెప్పే సంస్థలు వస్తువుల ధరను పెంచవచ్చు. అలాగే, ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ వంటి అదనపు ఛార్జీలు వసూలు చేయవచ్చు.

### పరోక్ష ఛార్జీల సమస్య

ఈ విషయమై ఆర్థిక నిపుణులు మాట్లాడుతూ, నో కాస్ట్ ఈఎంఐ పథకాలు తరచుగా అనవసరమైన వస్తువులను కొనడానికి ప్రేరేపిస్తాయి. వాయిదా భారం తగ్గుతుందని భావించి, మనం అదనంగా వస్తువులు కొంటాం. ఇది దీర్ఘకాలంలో మన పొదుపును ప్రభావితం చేయడంతోపాటు ఆర్థిక సమస్యలను కలిగిస్తుంది. నిజానికి, ఉచిత రుణం అనేది ఏదీ లేదు. విక్రేతలు వడ్డీని భరించి, కస్టమర్లకు వడ్డీ రహిత నెలవారీ వాయిదా చెల్లింపు అవకాశాన్ని ఇస్తారు. కానీ, దానికి బదులుగా ఇతర మార్గాలలో ఆ మొత్తాన్ని వసూలు చేస్తారు. ఇది ఒక ప్రమోషనల్ ప్లాన్ మాత్రమే అని నిపుణులు చెప్పారు.

### వస్తువులు కొనే ముందు గమనించాల్సినవి

మీరు వస్తువులు కొనే ముందు మీరు ఎంచుకునే నెలవారీ వాయిదా పథకం మీ ఆదాయానికి సరిపోతుందో లేదో చూడాలి. అది మీ నెలవారీ ఖర్చులను ప్రభావితం చేయకూడదు. కొన్ని పథకాలలో ఒక నిర్దిష్ట కాలానికి మాత్రమే వడ్డీ లేకుండా ఉంటుంది. ఆ తర్వాత వడ్డీ వసూలు చేస్తారు. దీనిని ముందుగానే సరిచూసుకోవాలి. ప్రతి నో కాస్ట్ నెలవారీ వాయిదా పథకంలో ఉన్న నిబంధనలను జాగ్రత్తగా చదివి, మొత్తం ఖర్చును లెక్కించాలి.

## జీవితకాల గరిష్ఠానికి పుత్తడి..!

### సామాన్యులకు పసిడి షాక్..

### ఒకే రోజు రూ.5వేలు పెరిగిన పుత్తడి

**న్యూఢిల్లీ:** పసిడి ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా పెరుగుతున్నాయి. తాజాగా ఒకేరోజు రూ.5వేలకపైగా పెరిగి తొలిసారిగా జీవితకాల గరిష్ఠానికి చేరాయి. దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.5,080 పెరిగి తులానికి రూ.1,12,750కి పెరిగింది. డాలర్ బలహీనపడడంతో బంగారానికి డిమాండ్ పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. మరో వైపు వెండి ధరలు సైతం భారీగానే పెరిగాయి. రూ.2,800 పెరిగి కిలోకు రూ.1,28,800 పెరిగి రికార్డు స్థాయికి చేరుకుంది. ప్రపంచ మార్కెట్లలో పసిడి మంగళవారం ఔన్సుకు 3,659.27 డాలర్లకు చేరి జీవితకాల గరిష్ఠానికి చేరింది.

ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 3,652.72 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది. యూఎస్ డాలర్ బలహీనపడడం.. త్వరలో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించనుందన్న అంచనాల మధ్య బంగారం వంటి సురక్షితమైన ఆస్తులపై పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. ఎంసీఎక్స్‌లో ప్రారంభంలో బంగారం, వెండి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో అక్టోబర్ ఫ్యూచర్ గోల్డ్ తులానికి రూ.429 లాభంతో రూ.1,08,947 వద్ద మొదలైంది. ఇదే క్రమంలో రూ.1,09,500 గరిష్ఠాన్ని తాకింది. కామెక్స్‌లో బంగారం 0.50శాతం లాభంతో 3654 డాలర్ల వద్ద.. ఎంసీఎక్స్‌లో 0.69శాతం లాభాలతో రూ.1,09,250 వద్ద ట్రేడ్ అయింది.



ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరలను పరిశీలిస్తే.. 24 క్యారెట్ల బంగారం రూ.1,10,290 ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,01,100 వద్ద ట్రేడవుతున్నది. ఇక వెండి ధర కిలోకు 1.40లక్షలకు పెరిగింది.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### సెన్సెక్స్ 314 పాయింట్లు జంప్..!

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 314 పాయింట్లు పెరగ్గా.. నిఫ్టీ 95పాయింట్లకుపైగా పెరిగాయి. ఐటీ స్టాక్స్ రాణించడంతో పాటు ఈ నెల చివరలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించనుందనే అంచనాల మధ్య ర్యాలీ కొనసాగింది. సెన్సెక్స్ 81వేల పాయింట్ల ఎగువన ముగిసింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,129.69 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,927.97 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,181.37 పాయింట్లకు పెరిగింది.

చివరకు 314.02 పాయింట్ల లాభంతో 81,101.32 వద్ద స్థిరపడింది.



నిఫ్టీ సైతం 0.39 శాతం పెరిగి 24,868.60 పాయింట్ల వద్ద ముగిసింది. వరుసగా ఐదోరోజు మార్కెట్లు లాభపడ్డాయి. భారత్‌లో ప్రముఖ ఐటీ సేవల సంస్థ అయిన ఇన్ఫోసిస్ సెప్టెంబర్ 11న ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేసే ప్రతిపాదనను బోర్డు పరిశీలిస్తుందని చెప్పడంతో 5.03 శాతం లాభపడింది. టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, బజాజ్ ఫిన్‌సర్వ్ లాభాలను ఆర్జించాయి. ట్రెంట్, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ నష్టాల్లో ముగిశాయి.

# ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయం

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

ప్రజా చైతన్యమే లక్ష్యంగా మహాకవి కాళోజీ నారాయణ రావు రచనలు సాహితీవేత్తగా సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రజాకవి స్వర్గీయ కాళోజీ నారాయణరావు 111 వ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రజాకవి కాళోజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ జీవిత చలనశీలి కాళోజి అని పుట్టుక చావులు కాకుండా బతుకంతా తెలంగాణ కిచ్చిన మహనీయుడు వైతాళికుడు కాళోజి అని అన్నారు. ప్రజాకవి కాళోజీ నారా యణరావును యువత ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ పద్మశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. కళావతి బాయి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ శ్రీనివాస్ ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు కలెక్టరేట్ ఏవో కె శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎఐటియుసి సభ్యురాలు బలవంతపు అగర్త కి నివాళులు అర్పించిన నేతలు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:**

సత్తుపల్లి మండలం కొత్తూరు అంగనవాడి టీచర్ గా పనిచేస్తున్న బలవంతపు అగర్త అకాల మృతికి ఏఐటీయూసీ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అగర్త పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి తడికమల్ల యోబు, ఏఐటియుసి మండల నాయకులు తాటి నాగేంద్ర, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు విజయమ్మ జంగం నాగేంద్ర లక్ష్మి పద్మ మండల పరిధిలోని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అగర్త మృతికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బలవంతపు అగర్త సత్తుపల్లి లో ఏఐటియుసి యూనియన్ స్థాపించడానికి ముందుకు వచ్చిన ప్రథమ సభ్యురాలని, ఏఐటీయూసీ సంఘం కొరకు అగర్త చివరి వరకూ శ్రమించారని రామకృష్ణ అన్నారు. ఆమె మరణం వారి కుటుంబ సభ్యులకే కాకుండా ఏఐటియుసి సంఘానికి తీరని నష్టమని రామకృష్ణ అన్నారు..

# ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిపి

**ప్రజలతో సమన్వయంతో పని చేసి కేసులు వేగంగా పరిష్కరించాలి**



**వరంగల్, అక్షిత బ్యూరో:**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ ని స్టేషన్ సిబ్బంది మొక్క అందజేసి సాదరంగా ఆహ్వానించారు. తరువాత కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి శుభ్రత, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధి నిర్వహణపై సమీక్ష జరిపారు. స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరు, కేసుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. అదేవిధంగా స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసులు, స్థానిక కాలనీల పరిస్థితులు, రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీల జాబితా తదితర అంశాలపై ఇన్‌స్పెక్టర్ షకూర్ ను అడిగి తెలుసుకున్నారుఈ సందర్భంగా కమిషనర్ సీపీ మాట్లాడుతూ సిబ్బంది ప్రజలతో మరింత సమన్వయంతో వ్యవహరించి, సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సీపీతో పాటు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏఎస్పీ శుభమ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా కష్టాలు తీరెనా ?

**రైతుసంఘం నేతలు బంటు, వీరపల్లి**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

మిర్యాలగూడ మండలం యాద్గారుపల్లి గ్రామంలో యూరియా కోసం బారులు తీరిన రైతులను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(సిపిఐ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు తెలంగాణ రైతు సంఘం (సిపిఎం)జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు కలిసి రైతులతో మాట్లాడి కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల యూరియా కష్టాలు ఇంకెన్నడు తీరునని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు గంటలు తరబడి క్యూలో నిలబడి ఒక్కొక్క మనిషికి 2 బస్తాల చొప్పున ఇవ్వడంతో రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రానికి అవసరమైనంత యూరియా పంపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు అనేక జిల్లాలలో మండలాలలో యూరియా కోసం రోజుల తరబడి పడిగాపులు కాసినా కూడ యూరియా దొరకక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అక్కడున్న రైతులు అప్పనబోయిన వెంకటయ్య, వస్కుల రవి, కన్నికంటి రామకృష్ణ, అప్పనబోయిన పురుషోత్తం, చింతమల రాములు, గువ్వలమట్టయ్య సిహెచ్ ఆంజనేయులు బొబ్బిలి ప్రశాంత్, గువ్వల శేఖర్, ప్రతాప్, బంటు నరసయ్య, వెంకన్న, రామలింగయ్య, లక్ష్మీ, లక్ష్మమ్మ, యశోద రైతులు ఉన్నారు

# గిరిజన సంస్కృతిని పరిరక్షించాలి

**ఆది కర్మయోగి అభియాన్**

**విజయవంతం చేయాలి**

**కలెక్టర్ విజయేందిర బోయి**





**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి :**

ఆది కర్మయోగి అభియాన్ మిషన్ ను గ్రామస్థాయిలో మూవ్ మెంట్ లాగా అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు సాధికారత కల్పించడం, ప్రతిస్పందనాత్మక పాలనను బలోపేతం చేయడం, స్థానిక నాయకత్వ అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఆది కర్మ యోగి అభియాన్ ను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ మిషన్ పై మిషన్ భగీరథ, విద్య, వైద్య, డిఆర్డిఓ, గిరిజన సంక్షేమ, మహిళా సంక్షేమ, అటవీ తదితర శాఖల అధికారులతో జిల్లా స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలో 10 మండలం లలో మండలాల్లోని 25 గిరిజన గ్రామాలను ఆదికర్మ యోగి అభియాన్ మిషన్ కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ప్రతిష్టాత్మకమైన సుపరిపాలనకు 7 శాఖల సమన్వయంతో ప్రతి పౌరునికి ప్రభుత్వ పథకాలు అందేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. డిస్టిక్ ప్రాసెస్ ల్యాబ్ గా ఎంపిక చేసిన సిబ్బందికి కార్యక్రమ అమలుపై 15 అంశాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు..జిల్లా ట్రైనర్ లు 10,11,12 తేదీల్లో మండల బ్లాక్ ట్రైనర్ లకు శిక్షణ నిస్తారు. బ్లాక్ ట్రైనర్ లు, గ్రామ స్థాయిలో శిక్షణ నిస్తారని తెలిపారు. అవగాహన పొందిన సిబ్బంది గిరిజన ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు చేపట్టబడిన ఈ పథకాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ విజయవంతం చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుపరిపాలన, సేవల్లో పారదర్శకంగా ఉండాలన్న లక్ష్యంతో చేపట్టారని తెలిపారు. అర్హులకు సంక్షేమ పథకాలు అమలయ్యేలా పనిచేయటమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యామని అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ఈ కార్యక్రమం ద్వారా గిరిజనుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. అన్ని శాఖల సిబ్బంది ఆదికర్మ యోగి మిషన్ పై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, ఎంపిక చేసిన గిరిజన గ్రామాల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలు విద్య అక్షరాస్యత, వైద్య సౌకర్యాలు,త్రాగు నీటి సౌకర్యం,గృహ నిర్మాణం, గ్రామీణా భివృద్ధి శాఖ ద్వారా జీవనోపాధి కార్యక్రమాలు,మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా మహిళలు,పిల్లలకు ,పోషణ సేవలు, వ్యవసాయ,అటవీ శాఖ ద్వారా కార్యక్రమాలు పక్కాగా సంతృప్త స్థాయిలో ఎం.పి.డి.ఓ లు నాయకత్వంలో మండల స్థాయిలో సమర్థంగా అమలు చేయాలని అన్నారు. ఏదైనా సమస్య ఒక శాఖ దృష్టికి వచ్చినట్లయితే ఆ శాఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. వచ్చిన ప్రజల సమస్యలను సులభంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవటమే మన ముందున్నటువంటి ప్రధాన కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ మూడు రోజుల అవగాహన కార్యక్రమంలో సమగ్ర కార్యాచరణ తయారుచేసి అన్ని గ్రామ పంచాయతీల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఆది కర్మ యోగి కార్యక్రమంలో భాగంగా గిరిజన గ్రామాల్లో పాలన, సేవలను అమలు చేసేందుకు శిక్షణ పొందిన కార్యకర్తలను నియమించ నున్నామన్నారు. గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ భాగస్వామ్యంతో సాధికారత కల్పించే లక్ష్యంతో ఆది కర్మ యోగి సిద్ధాంతం అమలు చేయనున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, జీవనోపాధిలో అంతరాలను తగ్గించేందుకు ఆది కర్మ యోగి కార్యక్రమం ద్వారా చర్యలు చేపడతామన్నారు. గిరిజన భాషలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో అభివృద్ధిని ప్రోత్సహించనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల అమలు ద్వారా గ్రామస్థాయిలో మంచి ఫలితాలు రావాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా ప్రభారి ప్రదీప్ కుమార్ సింగ్,జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి,జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె జనార్ధన్, డీఈఓ ప్రవీణ్ కుమార్, మహిళా,శిశు సంక్షేమ అధికారి జరీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

# రామవరంలో మహిళా అధ్యక్షుల నూతన కమిటీ ఎన్నిక..



**వర్ధన్నపేట అక్షిత ప్రతినిధి :**

వరంగల్ జిల్లా రూరల్ వర్ధన్నపేట్ నియోజకవర్గం రామవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షుల నూతన కమిటీ మండల పార్టీ ఆధ్వర్యంలో. మంగళవారం మహిళా అధ్యక్షులను కమిటీలుగా వేసి ఎన్నుకున్నారు. మహమ్మద్ నజీమా. రామవరం మహిళా అధ్యక్షురాలుగా. కుక్కల రాజమ్మ ఉపాధ్యక్షురాలు. వల్లాల సరూప బూత్. అధ్యక్షులు. గజ్జెల సునీత బూత్ అధ్యక్షులు గజ్జెల ఉమా మండల కమిటీ గజ్జెల మమత కార్యదర్శి. చిలుముల్లా యశోద ప్రధాన కార్యదర్శి చెరుపల్లి ఉపేంద్ర ఉపాధ్యక్షులు. చిలుముల్లా సుశీల కోశాధికారి చిలుముల్లా యాక లక్ష్మి ముఖ్య సలహాదారులు గుమ్మడి రాజు ఉపేంద్ర. ఎన్నుకున్నారు. అనంతరం మహిళా అధ్యక్షురాలు మహమ్మద్ నజీమా మాట్లాడుతూ. మండల కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నాపై నమ్మకంతో నన్ను అధ్యక్షురాలుగా ఏపిక చేసినందుకు. కాంగ్రెస్ పార్టీకి మహిళలును అందరిని నా సాయి శక్తుల కాంగ్రెస్ పార్టీని బలోపేతంనికి కృషి చేస్తా అని అన్నారు. మండల కమిటీ నాయకులకు మహిళా నాయకురాలకు గ్రామ శాఖ అధ్యక్షులు కు సీనియర్ నాయకులుకు పేరు పేరునా అందరికీ. కృతజ్ఞతలు. తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ. నాయకులు పోశాల వెంకన్న వర్ధన్నపేట మండల మహిళా అధ్యక్షురాలు మీరు పట్ల అరుణ సాయికుమార్. రామవరం గ్రామ శాఖ అధ్యక్షులు కే ప్రశాంత్ రెడ్డి సీనియర్ నాయకులు గజ్జెల సోమనర్సయ్య ఎండి జలీల్ గజ్జెల సుధాకర్ డా. వల్లాల సుదర్శన్ సిహెచ్ ఎలేంద్ర తదితరు నాయకులు పాల్గొన్నారు..

# రైతుల కష్టాలు తీర్చాలి, రాజకీయాలు మానుకోవాలి

**బీఆర్ఎస్ నాయకులు సూరయ్య, రమేష్ డిమాండ్**




**నర్సంపేట అక్షిత ప్రతినిధి:**

యూరియా కొరతతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఇందులో రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సంగని సూరయ్య మరియు సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెక్కొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, యూరియా కోసం రైతులు, మహిళలు, చిన్నారులు రాత్రిపూట కూడా చలిలో దుప్పట్లు పట్టుకొని లైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని సూరయ్య ఆరోపించారు. "నిన్న 740 మంది రైతులకు టోకెన్లు ఇచ్చి, ఈరోజు కేవలం 300 బస్తాలు మాత్రమే ఇవ్వడం దారుణం. మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటి?" అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. అనంతరం

రమేష్ యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ కోసం బావుల వద్ద నిద్రించిన రైతులు, ఇప్పుడు యూరియా కోసం సొసైటీల చుట్టూ తిరగాల్సి వస్తోందని విమర్శించారు. ప్రభుత్వం రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రైతుల కష్టాలు తీర్చకపోతే బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా నిలబడి పోరాడుతుందని, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధోనికాల సారంగపాణి, కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, నెక్కొండ మాజీ ఉప సర్పంచ్ దేవానబోయిన వీరభద్రం, కారింగుల సురేష్ గౌడ్, పొడిశెట్టి సత్యం, బక్కి కుమారస్వామి, చెరుకు లెనిన్ తదితరులు పాల్గొన్నారు

# వృద్ధాప్య మహిళ ఒంటరి జీవన పోరాటం

**రోడ్డుబౌండర్ మురికి కాలువపై ఇంటిలో నివాసం**

**నిరుపేద వృద్ధ మహిళ దుర్భర జీవితం**

**ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకలు**



**నాగారం అక్షిత న్యూస్ :-**

మండల కేంద్రంలో ఆర్.అండ్.బి రోడ్డు బౌండర్లో మురికి కాలువపై భర్త లేని, పిల్లలు లేని, వృద్యాప్యమైన ఒంటరి మహిళ మురికి కాలువపై ఇల్లు వేసుకొని బతుకుతున్న దృశ్యం ప్రతి మనిషిని మానవత్వాన్ని ప్రశ్నించే స్థితికి చేరుకుంది. వయస్సు మీద పడడంతో పనికి పనికిరాని స్థితి, పొట్ట నింపుకోవడానికి తినడానికి కూడా తిండి దొరకని పరిస్థితులు, తలదాచుకోవడానికి మురికి కాలువపై ఉన్న చిన్న ఇంటిలో దుర్భర జీవితం అనుభవిస్తున్న వృద్ధాప్య ఒంటరి మహిళ జీవన పోరాటం. వర్షం పడితే మురికి కాలువ ప్రవాహం, దుర్వాసన, దోమలు, ఊపిరాడని వాతావరణం, వృద్ధాప్య మహిళ నివసించే ప్రదేశం, ఆకలి, అనారోగ్యం, నిర్లక్ష్యం అనే మూడింటి మధ్య చిక్కుకుపోయి కన్నీళ్లతో బతుకుతున్న మండల కేంద్రానికి చెందిన కసిరబోయిన లక్ష్మమ్మ తండ్రి మల్లయ్య దీనగాథ. మంగళవారం నాగారం అక్షిత జాతీయ తెలుగు దినపత్రిక రిపోర్టర్ ను ఆ వృద్ధురాలు కలిసి నాకు భర్త లేడు, పిల్లలు లేరు, కూలి పనులు చేయడానికి వయస్సు పోయింది, మురికి కాలువ పై ఉన్న ఇంటిలో నిద్ర పట్టదు, అప్పుడే నాకు నా జీవితం కన్నా మరణమే మంచిది అనిపిస్తుంది అని కన్నీటి పర్యమయింది. నాకు వచ్చే వృద్యాప్య పెన్షన్ తో నాకు ఉన్న రోగాలతో మెడిసిన్ ఖర్చులతో పాటు, నేను బ్రతకటమే చాలా గండంగా మారిందని ఇక చావే శరణ్యమని వలపోస్తోంది. తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేలు, జిల్లా కలెక్టర్ గారు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థలు యువజన సంఘాలు మహిళా సంఘాలు వ్యక్తిగతంగా ఆర్థికంగా నన్ను ఆదుకోవాలని రెండు చేతులు జోడించి నమస్కారం చేస్తున్నది. కనుక మానవతా దృక్పథంతో దిక్కులేని ఒంటరి వృద్ధాప్య మహిళను ఆర్థికంగా ఆదుకోవాలని, తనను కాపాడాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

# ప్రమాద బీమా పై సీఎం రేవంత్‌కు ప్రైవేట్ ఎలక్ట్రీషన్ల పాలాభిషేకం



**భద్రాద్రి కొత్తగూడెం /అక్షిత న్యూస్.**

కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డి కి ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు, టెక్నీషియన్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్లో ప్రైవేట్ ఎలక్ట్రిషన్, టెక్నీషియన్స్ ట్రేడ్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, "ప్రైవేట్ ఎలక్ట్రిషన్ రాష్ట్ర అధ్యక్షుడు జడల అంజయ్య కృషి వల్లే కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తింపజేయడం సాధ్యమైంది" అని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక వెంకటస్వామి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. షరీఫ్, రఘురాం, కుమార్, వెన్నం సతీష్, నరేష్, రవికుమార్, ఎస్.కే. పాషా, నరసింహారావు, గోపి, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**వన్ టౌన్ సిఐ ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి**




**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :**

నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో, అన్ని రాజీ పడదగిన కేసులలో, డీడీ మరియు పెట్టి కేసులలో ఉన్న వారికి, గౌరవ కోర్టు వారు ఈ నెల 13 వ తేదీన ఒక గొప్ప అవకాశం కల్పించనుంది. ఈ అవకాశాన్ని కక్షీదారులు, రెస్పాడెంట్స్ ఉపయోగించుకొని గతంలో విధింపబడిన కేసులను తీసేయించుకొని సీజ్ చేసిన డాక్యుమెంట్స్, మొబైల్ ఫోన్స్ తీసుకొని వెళ్ళగలరు. ఏదేని సందేహం ఉన్నవారు కోర్టు సిబ్బంది రామకృష్ణ 9866527533 కి గాని, పోలీస్ స్టేషన్ కి గాని సంప్రదించాలని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్, విజయవాడల్లో

## ఓజీ ప్రీ రిలీజ్ ఈవెంట్స్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'ఓజీ' సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ, అభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా, సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఈ నెల 19న విజయవాడ, 21న హైదరాబాద్ లో రెండు భారీ ప్రీ-రిలీజ్ ఈవెంట్లు- నిర్వహించనున్నట్టు- సమాచారం. హైదరాబాద్ ఈవెంట్‌కు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశముందని సినీ వర్గాల్లో బలమైన చర్చ సాగుతోంది. తమ్ముడు పవన్ కళ్యాణ్ సినిమాకు అన్నయ్య చిరంజీవి వస్తే, అది మెగా ఫ్యాన్స్‌కి డబుల్ సెలబ్రేషన్ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. చిరు-పవన్ కలిసి చాలా కాలం తరువాత ఒకే వేదికపై కనిపించనుండడం ఈ ఈవెంట్‌కు మరింత ప్రత్యేకతను తెస్తుంది. 'ఓజీ' పై అంచనాలు నేడు దేశీయ మార్కెట్‌లో మాత్రమే కాదు, విదేశాల్లో కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. నార్త్ అమెరికాలో ఇప్పటికే లక్షలాది టికెట్లు అడ్వాన్స్ బుకింగ్‌లో అమ్ముడవుతున్నాయి. అక్కడి డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు ఈ ఫిల్మ్ పెద్ద హిట్టు- అని ముందే ఊహిస్తున్నాయి. టీజర్, గ్లింప్స్, సాంగ్స్‌కు భారీ రెస్పాన్స్ రావడం వలన ఈ క్రేజ్ మరింత పెరిగింది. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించనున్నట్టు- సమాచారం. అంతేకాదు, డ్యూయెల్ పాత్ర పోషించినట్టు- ఇండస్ట్రీ టాక్. ఈ చిత్రం ద్వారా పవన్ తన ఫ్యాన్స్‌కి మళ్లీ మాస్ ట్రీ-ట్ ఇవ్వాలని ఫిక్స్ అయిపోయాడు. ఇటీ-వల హరిహర వీరమల్లుతో నిరాశలో ఉన్న అభిమానులు, క్షఏ ద్వారా ఊపిరి పీల్చుకోవాలని భావిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా చేస్తున్నాయి . ఓజీ బ్యాగ్రౌండ్ స్కోర్ మరో లెవెల్‌లో ఉండబోతుందని టాక్. ఈ సినిమా కోసం థమన్ బాగానే హార్డ్ వర్క్ చేస్తున్నాడట.

## సల్మాన్ బ్యాటిల్ ఆఫ్ గల్వాన్

కల్నల్ సంతోష్ బాబుపాత్రలో కండలవీరుడు



బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న వార్ డ్రామా 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' . ఈ సినిమాకు అపూర్వ లాఖియా దర్శకత్వం వహిస్తుండగా.. బాలీవుడ్ బ్యూటీ- చిత్రాంగద సింగ్ కథానాయికగా నటించబోతుంది. సల్మాన్ ఖాన్, చిత్రాంగద సింగ్ కలిసి నటిస్తున్న మొదటి చిత్రం ఇది. భారతదేశం-చైనా సరిహద్దులో 2020లో జరిగిన గల్వాన్ లోయ సంఘటన ఆధారంగా ఈ సినిమా తెరకెక్కబోతుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ ప్రారంభించినట్లు- సల్మాన్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. ఇక ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్ తెలంగాణకు చెందిన వీర సైనికుడు, గల్వాన్ వీరుడు కల్నల్ సంతోష్ బాబు పాత్రలో నటించబోతున్నట్లు- సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ఆల్‌మోస్ట్ టాలీవుడ్‌కు దూరమైన తాప్సీ..

2010లో ఝుమ్మంది నాథం సినిమాతో కథానాయికగా తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్న ఈ అమ్మడు.. ఆతర్వాత ధనుష్ సరసన ఆడుకలం సినిమాతో కోలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. తెలుగులో వరుస అవకాశాలు వచ్చినప్పటికీ తమిళంలో మాత్రం అంతగా ఆఫర్స్ అందుకోలేకపోయింది. తెలుగులో స్టార్ హీరోలతో కలిసి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రభాస్ జోడిగా మిస్టర్ పర్ఫెక్ట్ మూవీలో మెరిసింది. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే బాలీవుడ్ షిఫ్ట్ అయిన ఈ అమ్మడు.. అక్కడ సైతం హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస అవకాశాలు అందుకుంది. చివరగా షారుఖ్ సరసన డుంకీ చిత్రంతో హిట్టుకొట్టిన ఈ బ్యూటీ.. ఇప్పటికీ మరో ప్రాజెక్ట్ అనౌన్స్ చేయలేదు. ఇదిలా ఉంటే.. 11 సంవత్సరాలు డేటింగ్ చేసిన తర్వాత తాప్సీ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోయిస్‌ను కుటుంబ సభ్యుల మధ్య వివాహం చేసుకుంది. వీరిద్దరి పెళ్లి వేడుక ఉదయపూర్ లో జరిగింది. ప్రస్తుతం తాప్సీ ములాక్ 2, గాంధారి చిత్రాల్లో నటిస్తుంది. ఆచితూచి సినిమాలు చేస్తున్న ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది ఈ చిన్నది. తాజాగా ఈ ముద్దు గుమ్మకు సంబందించిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఈ అమ్మడు నెట్టింట ఓ వైపు పద్దతిగా ఆకట్టుకుంటూనే మరో వైపు మోడ్రన్ డ్రస్సుల్లో మెరుస్తూ కవ్విస్తుంది.




## యాక్సిడెంట్ వార్తలు అబద్ధం

నటి కాజల్



అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్‌కు యాక్సిడెంట్ అయిందని పరిస్థితి విషమంగా ఉందంటూ సోషల్ మీడియాలో కొన్ని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిపై కాజల్ స్పందించారు. తాను క్షేమంగానే ఉన్నానని ఆ వార్తలన్నీ రూమర్స్ మాత్రమేనని చెప్పారు. కాజల్‌కు యాక్సిడెంట్ అయిందనే వార్తలు సోమవారం సాయంత్రం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆందోళన చెందిన అభిమానులు ఆమెను ట్యాగ్ చేస్తూ పోస్ట్‌లు పెట్టారు. దీనిపై కాజల్ స్పందిస్తూ ఈ వార్తలను ఖండించారు. నిజం చెప్పాలంటే అవి చూసి నేను నవ్వుకున్నాను. ఎందుకంటే ఇంతకుమించిన ఫన్నీ న్యూస్ ఉండదు. అవన్నీ పూర్తి అవాస్తవం. దేవుడి దయ వల్ల నేను క్షేమంగా, సురక్షితంగా ఉన్నాను. ఇలాంటి తప్పుడు వార్తలు నమ్మొద్దు, ప్రచారం కూడా చేయొద్దని మీ అందరినీ అభ్యర్థిస్తున్నాను. ఇలాంటి ఫేక్ న్యూస్‌లను షేర్ చేసే బదులు ఏవైనా నిజమైన వార్తలను నలుగురితో పంచుకోండి అంటూ నోట్ విడుదల చేశారు.

## క్రిష్-4 సిరీస్‌కు రెడీ అంటున్న హృతిక్



బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ నటించిన చిత్రాల్లో 'క్రిష్' విశేష ఆదరణను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'క్రిష్ 3' తెరకెక్కి మంచి విజయాన్ని అందుకుంది. ఈ ఫ్రాంచైజీలోనే 'క్రిష్ 4' రానుంది. దీనికి హృతిక్ రోషన్ దర్శకత్వం వహించనున్నారు. అయితే భారీ బడ్జెట్ కారణంగా దీని షూటింగ్‌ను ప్రారంభించలేక పోతున్నట్లు- హృతిక్ తండ్రి రాకేశ్ రోషన్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. తాజాగా దీనిపై ఆయన అప్‌డేట్ ఇచ్చారు. బడ్జెట్‌పై అవగాహన వచ్చిందన్నారు. తాము ఎంత ప్రయత్నించినా ఈ సినిమాకు బడ్జెట్ సమకూరడం లేదని అందుకే ఇది ఆలస్యమవుతోందని గతంలో రాకేశ్ తెలిపారు. నాలుగో భాగాన్ని మరింత గ్రాండ్‌గా తీయాలని ఒకవేళ బడ్జెట్ తగ్గించాలని చూస్తే.. ఈ చిత్రం ఓ సాధారణ కథలా అయిపోతుందని చెప్పారు. తాజాగా దీనిపై ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'స్క్రిప్ట్ రాయడానికి పెద్దగా సమయం పట్టదు. కానీ, బడ్జెట్ విషయంలో ఒత్తిడి వల్లే ఇన్ని రోజులు ముందుకువెళ్లలేకపోయాం. ఇప్పుడు ఈ సినిమాకు ఎంత బడ్జెట్ అవుతుంది అనే దానిపై మాకు అవగాహన వచ్చింది. ప్రస్తుతం దీని పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రీ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ సమయం పట్టొచ్చు. వచ్చే ఏడాదిలో చిత్రీకరణను ప్రారంభిస్తాం. 2027లో దీన్ని మీ ముందుకు తీసుకురావాలని భావిస్తున్నామని తెలిపారు. 'క్రిష్' సిరీస్ చిత్రాలకు దర్శకత్వం వహించిన రాకేశ్ రోషన్ నాలుగో భాగానికి కూడా తెరకెక్కించనున్నారని గతంలో వార్తలు వచ్చాయి. వాటికి చెక్ పెడుతూ తన కుమారుడు హృతిక్ రోషన్ దర్శకత్వంలో 'క్రిష్ 4' వస్తుందని తెలిపారు. ఇక ఈ సిరీస్ చిత్రాలు వరుసగా 2003, 2006, 2013 సంవత్సరాల్లో విడుదలైన విషయం తెలిసిందే.

## ఏఐ సాయంతో అశ్లీల కంటెంట్

హైకోర్టును ఆశ్రయించిన నటి ఐశ్వర్యారాయ్



బాలీవుడ్ స్టార్ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. తన అనుమతి లేకుండా తన ఫోటోలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సృష్టించబడుతున్న అశ్లీల చిత్రాలను అడ్డుకోవాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు- ఐశ్వర్య పేర్కొంది. అయితే ఈ కేసు నేడు విచారణకు రాగా.. ఐశ్వర్య తరపున వాదించిన సీనియర్ అడ్వకేట్ సందీప్ సేథీ మాట్లాడుతూ.. ఐశ్వర్య రాయ్ చిత్రాలు కానీ, రూపం కానీ ఉపయోగించుకునే హక్కు ఎవరికీ లేదు. ఒక వ్యక్తి ఆమె పేరు ముఖాన్ని ఉపయోగించి ఆట ద్వారా డబ్బు సంపాదిస్తున్నాడు అని సేథీ వాదించారు. ఆమె పేరు రూపం ఎవరిదో లైంగిక కోరికలు తీర్చడానికి ఉపయోగించబడుతోంది. ఇది చాలా దురదృష్టకరం అని ఆయన కోర్టు ముందు పేర్కొన్నారు. అయితే ఐశ్వర్య పిటిషన్‌ని విచారించిన జస్టిస్ తేజస్ కరియా దీనిపై ప్రతివాదులకు వ్యతిరేకంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తామని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 7న జాయింట్ రిజిస్ట్రార్ ముందుకి.. ఆ తర్వాత జనవరి 15, 2026న కోర్టు ముందుకి వాయిదా వేసినట్లు- హైకోర్టు తెలిపింది.

# ట్రైనీ ఎంవిఐలు బాధ్యతలు స్వీకరణ



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించే ముందు జిల్లాకు అనుభవం కోసం కేటాయించిన 16 మంది ట్రైనీ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లలో మిర్యాలగూడ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ పరిధిలో నలుగురు శిక్షణ పొంది ఉన్న పి. ప్రసాద్ మురళి, టీ. సతీష్ కుమార్, ఎస్. శ్రీకాంత్, ఎం. రాఘవ్ లు మిర్యాలగూడ ఎంవిఐ ఎల్. వీరాస్వామి వద్ద తమ పరిధిలో చేస్తున్న పనులు, కార్యాలయం పనులు, క్షేత్ర స్థాయిలో చేయాల్సిన పనులు ట్రైనీలకు వివరించారు. ప్రసాద్ మిర్యాలగూడ మండలం హట్యతండాలో గ్రామపంచాయతి కార్యదర్శిగా పని ఎంవీఐ పరీక్షల్లో ర్యాంకు సాధించి ఎంవిఐ ఉద్యోగం సాధించారు. అదేవిధంగా సతీష్ కుమార్ దక్షిణ మధ్య రైల్వేస్ ఉద్యోగం వదులుకుని ఎంవిఐ అయ్యారు. శ్రీకాంత్ టీ జేన్కోలో ఎఇ ఉద్యోగం వదిలి ఎంవిఐ అయ్యారు. రాఘవ్ సాఫ్ట్ వేర్ జాబ్ వదిలి ఎంవిఐ అయ్యారు.

# బిజెపి అభియాన్ యోజన ఇంటింటికి ప్రచారం



**చేర్యాల అక్షిత ప్రతినిధి:**

చేర్యాల మండల బిజెపి అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో, సంపర్క్ అభియాన్ యోజన ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేర్యాల మండలంలోని కడవేర్గు గ్రామంలో ఇంటింటికి తిరిగి నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించి రాబోయే స్థానిక ఎన్నికల గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జనగామ జిల్లా ఉపాధ్యక్షులు దేవరాయ ఎల్లయ్య రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ పథకాలు ప్రతి ఒక్కరికి చేరే విధంగా కృషి చేయడం జరిగింది, అవినీతి లేని పాలన అందించిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వమే అని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కర్క తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు పోతుగంటి రామదాసు , మన్నె సత్యవర్ధన్, మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు, నాయకులు మడికొండ శ్రీనివాసరావు,గోపాల్ రెడ్డి, కుర్రారం బాల నర్సయ్య ,అప్పాల బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఫంగ సిద్ధి లింగం, మండల ఉపాధ్యక్షులు బయ్యారపు యాదగిరి,మండల కార్యదర్శులు గంధాల సత్యనారాయణ, పోలోజు రవి చారి, పట్టణ కార్యదర్శి వెలగల వినయ్ కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షులు యాసరేణి లక్ష్మీపతి, బూత్ అధ్యక్షులు చల్లా బాల్ రెడ్డి , కాసుల మల్లేశం, జాలిగామ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# 12 న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:**

ఈ నెల 12 న ఖమ్మం నగరంలో సిఐటియు అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు జరగనున్నాయి. వాటి జయప్రదాన్ని కాంక్షిస్తూ మంగళవారం ఖమ్మంజిల్లా వేంసూరు మండల పరిధిలోని పల్లెవాడ,చౌడవరం గ్రామాలలో పల్లెవాడ ఏరియా సిఐటియు అనుబంధం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కమిటి ఆధ్వర్యంలో బిసిడబ్ల్యూయు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ సిఐటియు చేస్తున్న పోరాటాల ఫలితమే భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద మరణానికి ఇస్తున్న 6 లక్షల భీమా సొమ్మును10 లక్షలకు సహజమరణ సహాయంకు ఇస్తున్న లక్ష బీమా ను 2 లక్షలకు పెంచడం జరిగిందని తెలిపారు. ఇదే సందర్భంలో రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటి ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించే కుట్ర చేస్తుందని సహించ వద్దన్నారు.పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ను కార్పొరేట్లకు ఇచ్చి కార్మికులకు ద్రోహం చేస్తే ఐక్య పోరాటాలు చేయాలని సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు జొన్నలగడ్డ ముత్తయ్య,కావూరి సుదర్శన్, రేగళ్ళ వీరస్వామి,రామకృష్ణ,సుందరం,కాటయ్య,గోవర్ధన్,మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పైళ్ళ శివ పుట్టినరోజు వేడుకలు



**నార్కట్ పల్లి, అక్షిత, ప్రతినిధి సెప్టెంబర్ 09 :**

మండల పరిధిలోని చౌటబావి గ్రామం వాస్తవ్యులు పైళ్ళ లింగారెడ్డి మాదవి కుమారుడు పైళ్ళ శివరెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు నిస్సహాయులకు బాటసారులకు బిక్షాటన చేసేవారికి 100మందికి అన్నదాన కార్యక్రమంలో నిర్వహించారు.పైళ్ళ లింగారెడ్డి మాట్లాడుతూ.. మొదటిసారి ఇక్కడ అన్నదానం చేపియడం ఇంతమంది నిరుపేలను చూస్తుంటే బాధగా ఉన్నదనిమరియు నా కొడుకు పుట్టినరోజు ఇంతమంది ఆకలితీర్చటం చాలా సంతోషకరమన్నారు.ఇకపై నా ముఖ్యమైన రోజులను ఇంతమంది నిరుపేదల మధ్య జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక శ్రీధర్,గార్ధస్సు వెంకటేశ్వర్లు,కళ్లెం సత్తి రెడ్డి, సోమ సుధాకర్ రెడ్డి సోమా ప్రతాప్ రెడ్డి, సోమా బుచ్చి రెడ్డి, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి సోమా రామిరెడ్డి, సోమా మనోహర్ రెడ్డి(చింటూ),సోమ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా రగడ
# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షం

## నెక్కొండలో హరీష్ రెడ్డి, అశోక్ స్పష్టీకరణ



**నర్సంపేట అక్షిత ప్రతినిధి**

నెక్కొండ మండలంలో యూరియా పంపిణీపై చెలరేగిన రాజకీయ రగడ తీవ్ర రూపం దాల్చింది. రైతుల యూరియా పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తుండగా, బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా రైతులను రెచ్చగొట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేస్తూ, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చేస్తున్నది కేవలం రాజకీయ ఉనికి కోసమేనని వారు విమర్శించారు.

**'ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం'**

నెక్కొండకు 30 టన్నుల యూరియా చేరుకోగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఉదయం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తమ నాయకులను పంపి, రాత్రిపూట రైతులను రెచ్చగొట్టారని హరీష్ రెడ్డి, అశోక్ ఆరోపించారు. ఈ అల్లర్ల వెనుక అసలు ఉద్దేశం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడమేనని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తోందని వారు పేర్కొన్నారు.

**'గత ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలు మర్చిపోలేదు'**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యూరియా కోసం క్యూలో నిలబడి ఒక రైతు చనిపోతే, అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి చేసిన హేళనను ప్రజలు మర్చిపోలేదని హరీష్ రెడ్డి, అశోక్ గుర్తు చేశారు. 'సినిమా టాకీస్ లో క్యూ లైన్ లో చనిపోతే సినిమా వాళ్ళు బాధ్యులవుతారా?' అని రైతులను అవమానకరంగా మాట్లాడారని వారు పేర్కొన్నారు. ఆ చేదు అనుభవాన్ని ప్రజలు ఇంకా గుర్తుంచుకున్నారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడుతుందని వారు హామీ ఇచ్చారు.

**'ప్రజల ఆదరణ చూసి ఓర్వలేక'**

గత పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇవ్వని, ఒక్క రేషన్ కార్డు కూడా జారీ చేయని బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు కదుతుండడం చూసి తట్టుకోలేకపోతున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. అందుకే తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి ఇలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుందని వారు స్పష్టం చేశారు.

**స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం**

ఇలాగే చిల్లర రాజకీయాలు చేస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హరీష్ రెడ్డి, అశోక్ హెచ్చరించారు. ఈ సమావేశంలో నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయి కృష్ణ సహా పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# న్యాయవాది జాహిర్ అలీపై దాడిని ఖండించిన ఐఎల్‌పిఏ.



**భద్రాద్రి కొత్తగూడెం /అక్షిత న్యూస్.**

ఖమ్మం జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది జాహిర్ అలీపై దుండగులు జరిపిన హత్యాయత్న దాడిని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పిఏ) తీవ్రంగా ఖండించింది.

ఈ మేరకు సంస్థ జిల్లా కన్వీనర్ జనపరెడ్డి గోపికృష్ణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాహిర్ అలీ తన కార్యాలయంలో ఉన్న సమయంలో కొంతమంది దుండగులు దాడి చేయడం, హతమార్చే ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని ఆయన అభివర్ణించారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే దాడి చేసిన వారిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి, నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఐఎల్‌పిఏ భాధ్యులు న్యాయవాదులు సుంకర భానుప్రియ, ఎర్రపాటి కృష్ణ, మార పాక రమేష్, వడ్లకొండ హరి, డి. సామంత్, మహమ్మద్ సాదిక్ పాషా, ధరావత్ రాధకృష్ణ, అంకుష్ పాషా, దేవేంద్ర వరకుమార్, బేబీ షామిలి, నీలివేణి, నందిని, ఉమా తదితరులు పాల్గొన్నారు

# తైక్వాండో పోటీలలో నాంపల్లి గాంధీజీ విద్యార్థుల ప్రభంజనం

## ఆత్మ రక్షణకు శరీరక దృఢత్వానికి టైక్వాండో ఎంతగానో పెంపొందిస్తుంది

## ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు



**నాంపల్లి, అక్షిత న్యూస్:**

ఆత్మ రక్షణకుశారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి తైక్వాండో ఎంతగానో దోహదపడుతుందని ట్రస్మా జిల్లా అధ్యక్షులు గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. ఈనెల 7వ తేదీన ఆదివారం నాడు నల్లగొండలోని సన్ లైట్ తైక్వాండో ఆకాడమీ రవీంద్ర నగర్ నందు నిర్వహించిన నల్లగొండ జిల్లా తైక్వాండో ఛాంపియన్ షిప్ -2025 పోటీల్లో నాంపల్లి మండల కేంద్రానికి చెందిన గాంధీజీ విద్యాసంస్థల్లోని విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పథకాలను సాధించారు. పథకాలు సాధించిన విద్యార్థుల్లో బి. లలిత మూడవ తరగతి దేవ వర్షిణి మూడవ తరగతి ఎ. కీర్తన కుమారి మూడవ తరగతి కె.నిఖిల్ నాలుగవ తరగతి జి. విగ్నేష్ నాలుగో తరగతి జి. జీవన్ ఆరవ తరగతి టి. ఆదిత్య ఆరవ తరగతి విద్యార్థులు గోల్డ్ మెడల్ పథకాలను పి.కీర్తన మూడవ తరగతి ఇ.దేవానంద్ మూడవ తరగతి డి. అక్షిత్ ఐదవ తరగతి జె. మహి సాత్విక్ ఆరవ తరగతి సిల్వర్ పథకాలను టి.విగ్నేష్ మూడవ తరగతి పి హర్షవర్ధన్ ఐదవ తరగతి వి లోకేష్ ఆరవ తరగతి సిహెచ్ నిషాంత్ ఆరవ తరగతి కాంస్య పథకాలను సాధించారు. వీరిని మంగళవారం నాడు స్థానిక గాంధీజీ విద్యాసంస్థల్లో ట్రస్మా జిల్లా అధ్యక్షులు గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మెడల్స్ ను సర్టిఫికెట్స్ ను అందించి అభినందించారు.ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ ఈనెల 12,13, 14వ తేదీలలో గద్వాల్ పట్టణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు గాంధీజీ విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు జాతీయ స్థాయి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పథకాలను సాధించి పుట్టిన ఊరుకు చదువుకున్న పాఠశాలకు కన్న తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆశించారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఆత్మర క్షణ కోసం తైక్వాండో నేర్చుకోవాలని అన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రంగాల్లో నైపుణ్యం పెంచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి వివిధ వేదికలపై జరిగే కార్యక్రమాలకు విద్యార్థులను పంపడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్స్ సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపల్స్ సామల వెంకటేశ్వర్లు, రామేశ్వరి, తైక్వాండో ట్రైనర్ నాగిళ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు

# దుండిగల్ పురపాలకలో కుక్కలకు వ్యాక్సినేషన్ డ్రైవ్ ఉచిత శిబిరం..

**మేడ్చల్, అక్షిత బ్యూరో :**

దుండిగల్ పురపాలక నందు 100 రోజుల ప్రణాళికలో భాగంగా, బ్లూ క్రాస్ సొసైటీ వారి భాగస్వామ్యంతో వీధి కుక్కలకు మరియు పెంపుడు కుక్కలకు పెద్ద ఎత్తున ఉచిత వ్యాక్సినేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించినారు, దుండిగల్ వార్డ్ ఆఫీస్ నందు క్యాంపు దుండిగల్ పురపాలక లో అన్ని వార్డుల యందు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మంగళవారం 264 వీధి కుక్కలకు పెంపుడు కుక్కలకు







యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేయించడం జరిగింది, అలాగే 21 వీధి కుక్కలను స్టెరైజేషన్ ఆపరేషన్ కోసం ఎ.బి.సి సెంటర్ కు పంపించారు ఇప్పటివరకు పురపాలక లో 2159 కుక్కలకు స్టెరైజేషన్ యాంటీ రేబిస్ టీకాలు వేయించడం జరిగింది, అని అన్నారు. కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్ బ్లూ క్రాస్ సొసైటీ షెల్టర్ డైరెక్టర్ ఆర్ ఎస్ కె కుమారి.దుందిగల్ వెటర్నరీ డాక్టర్ శైలజ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, మున్సిపల్ బిల్ కలెక్టర్ మాధవి.దుండిగల్ వార్డు జెవాన్. క్రాంతి సిబ్బంది పాల్గొన్నారు..

# సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లా



**చేర్యాల అక్షిత ప్రతినిధి:**

చేర్యాల, కొమరవెల్లి, మద్దూర్, ధూళి మిట్ట మండలాలకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారులకు 57 ,రూ 13,50,000/ రూపాయలకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పళ్ళ రాజేశ్వర్ రెడ్డి, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాళోజి జయంతి

## నల్గొండ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమ్మ



**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :**

కాళోజి జయంతి సందర్భంగా నల్లగొండ జిల్లా గ్రంథాలయంలో కాళోజి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమ్మ మాట్లాడుతూ తెలంగాణ యాస భాష ఎంతో ఉన్నతమైనదన్నారు. ఎమర్జెన్సీ కాలం నుంచి తెలంగాణ ఉద్యమంలో తన రచనల ద్వారా ఉద్యమ స్ఫూర్తి కల్పించిన వ్యక్తి కాళోజి నారాయణ రావు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పున్న అంజయ్య, యాదగిరి రెడ్డి, అలెగ్జాండర్, నరసింహ రెడ్డి, నాగయ్య, రాజేష్, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా కాళోజి జయంతి వేడుకలు..



**మేడ్చల్,అక్షిత బ్యూరో:**

దుండిగల్ పురపాలక కార్యాలయంలో మంగళవారం ఘనంగా కాళోజి జయంతి వేడుకలు కార్యక్రమాన్ని దుండిగల్ పురపాలక కమిషనర్ కే వెంకటేశ్వర్ నాయక్.ప్రజాకవి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి.నివాళులర్పించారు.కాళోజీ సేవలను, ఆయన రచనల ప్రాముఖ్యతను.గుర్తుచేసుకున్నారు. తెలంగాణ భాష, సంస్కృతి కోసం కాళోజీ చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆల్ స్టాఫ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దోమల బెడద

# శానిటేషన్ విభాగం ఉన్నట్లా లేనట్టా..?

**నిర్లక్ష్యపు నిద్ర మత్తులో మున్సిపల్ అధికారులు.**

**గ్రామాల్లో విపరీతంగా దోమలు ఫిర్యాదులు చేసిన పట్టించుకుని అధికారులు..**

**పురపాలక లో 28 పాకింగ్ మిషన్లు..అందులో పని చేసేది మిషన్ ఒక్కటే..**

**ఆరు గ్రామాలలో పాకింగ్ ఒక్క మిషిన్ తో జరిగేది సాధ్యమేనా..? అంటూ ప్రజలు విమర్శలు వెల్లువ..**




**మేడ్చల్,అక్షిత బ్యూరో:**

దుండిగల్ పురపాలక లో విపరీతంగా దోమల బెడద గ్రామాలలో దోమల బెడద ఉందంటూ ఫిర్యాదులు చేసిన



పట్టించుకోని అధికారులు. దోమ కాటుతో వచ్చే విష జ్వరాలు ద్వారా మలేరియా టైఫాయిడ్ ఇలాంటి వ్యాధులతో హాస్పటల్లో పాలవుతున్న కూడా అధికారులు నిర్లక్ష్యపు ధోరణిలో పని చేస్తున్నారా అంటూ లేక.సిబ్బంది వైఫల్యం అంటూ ప్రజలు నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. పురపాలక ఆరు గ్రామాలలో పాకింగ్. ఒకే మిషిన్ తో సాధ్యమేనా. ఏ గ్రామంలో అయినా పూర్తిస్థాయిలో పాకింగ్ చేయడం లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు. సయానా మున్సిపల్ కార్యాలయంలోనే కంప్యూటర్ సిస్టంలో ఉన్న ఆపరేటర్స్ అందరికీ దోమల బెడద ఉందంటూ చెప్పుకోలేక. ముక్కు మీద వేలు వేసుకునే పరిస్థితి ఉందంటూ వాపోతున్నారు. మా కార్యాలయంలోనే ఇలా ఉందంటే గ్రామంలో ఏ విధంగా ఉన్నాయో పరిస్థితులు అంటూ విమర్శలున్నాయి అధికారులు ఇప్పటికైనా కమిషనర్ చొరవ తీసుకొని గ్రామానికి ఒక్క పాకింగ్ మిషన్ తో గ్రామంలో చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు..




## ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు

**అక్షిత న్యూస్ అనంతగిరి**



అనంతగిరి మండల తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రముఖ కవి,స్వాతంత్ర్య సమరయోధుడు,ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ హిమబిందు ప్రజాకవి కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం వారు మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష పాత్ర పోషించారు.ఆయన రచనలు సామాజిక చైతన్యానికి మార్గదర్శకాలు.ఆయన స్ఫూర్తితో మనమంతా తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఆర్ ఐ వెంకటనగేష్ , జూనియర్ అసిస్టెంట్ మాధవి,ధరణి ఆపరేటర్ గణేష్,అటెండర్స్ అరుణ, మధార్ బి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ..

**అక్షిత న్యూస్ మునగల**



ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్నట్లు ఓ సామాజిక కార్యకర్త నిరుపేద కుటుంబానికి సహాయం చేశారు. వివరాల్లోకి వెళితే మునగాల మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది గా జీవితం సాగిస్తున్నా అన్నపాక వెంకటరత్నం గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో అకారణంగా మృతి చెందారు. సామాజిక కార్యకర్త చింతకాయల నాగరాజు మిత్ర బృందంతో మంగళవారం మృతి చెందిన కుటుంబానికి వారి గృహంలో ఒక నెలకు సరిపడా బియ్యం నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శీను, వెంకటేష్, వేణు గురువయ్య,,తదితరులు పాల్గొన్నారు

## డివిజన్లో పర్యటించిన కార్పొరేటర్ చామకూరి



**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

ఖమ్మం నగరం 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ దగ్గర ఉండి డివిజన్లోని ఇంటింటి చెత్తను ట్రాక్టర్ కి ఎత్తించారు. ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జవాన్ నాగరాజు పాషా నర్సిరెడ్డి భాస్కర్ బాల శివరాం శ్యామల రాజు వరికోటి భాస్కర్ విజయలక్ష్మి కన్నెబోయిన ముత్తయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్. సి. ఐ కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం..

**కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్**

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి..**

మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్సీఐ కాలనీ వాసులు కాలనీలో గల పలు సమస్యలు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది.దీనిపై కార్పొరేటర్ శ్రీకాంత్ సానుకూలంగా స్పందించడం జరిగినది.ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్సిఐ కాలనీవాసులు పలు సమస్యలు,చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై మంగళ వారం రోజు తమను కలవడం జరిగినది అని, ఎఫ్సిఐ కాలనీలో తలెత్తినటువంటి సమస్యలను స్వయంగా వెళ్లి పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పి ఎ సి ఛైర్మన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో ఎఫ్సిఐ కాలనీలో తలెత్తినటువంటి డ్రైనేజీ మంచినీటి కొరత, రోడ్ల సమస్యలను విడతల వారిగా త్వరలోనే పరిష్కరిస్తామని, డ్రైనేజీ, మంజీర మంచి నీటి వసతులను మెరుగుపరుస్తామని, మియాపూర్ డివిజన్ లో ప్రతి కాలనీలో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని, కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు, ముఖ్యంగా మియాపూర్ డివిజన్ ప్రజలకు అన్నివేళల్లో అందుబాటులో ఉండడం జరుగుతుందని,



డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, మెరుగైన ప్రజా జీవనానికి అన్నిరకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషిచేస్తానని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ గౌడ్, మియాపూర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుప్రజ, ఎఫ్సిఐ కాలనీ వాసులువెంకటేశ్వర్ రావు, హరికృష్ణ, రాశిల్, రామకృష్ణ, జితేందర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం శోభా యాత్రలో పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ..

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి..**

చందానగర్ డివిజన్ పరిధిలోని మంజీర రోడ్డులో వినాయక చవితి పర్వదినంను పురస్కరించుకుని వినాయక నిమజ్జనం శోభాయాత్రలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పి ఏ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు తొలగించి విజయాలను దరిచేర్చేవాడు వినాయకుడు అని అందుకే ఆయన్ను విఘ్నేశ్వరుడు అంటారు అని ఎంతోమంది దేవుళ్లు ఉన్నప్పటికీ మొదట పూజలు అందుకునేది ఆయనే కాబట్టి ఆదిదేవుడుగా కొలుస్తారు అని ఏనుగు తల, మనిషి శరీరం కలిగి ఉండి ఒకే దంతం కలిగి ఉండటంచేత ఏకదంతుడుగా కీర్తించబడుతున్నాడు అని దేవగణాలకు అధిపతి కాబట్టి గణపతిగా పూజలు అందుకుంటున్నాడు అని సకల లోకాల సర్వ జనులకు శుభాలు కలిగించే ఆ బొజ్జ గణపయ్య పండుగ వినాయక చవితిని అందరూ ఘనంగా జరుపుకుంటారు.అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియజేసారు.పండుగ ను చక్కటి వాతావరణంలో కుటుంబ సభ్యుల మధ్య ఆనందాయకంగా, సంతోషకరంగా జరుపుకోవాలని పిలుపునివ్వడం జరిగినది .అదేవిదంగా వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించుకోవడానికి అన్ని రకాల వసతులు కలిపించాలని ,పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ అధికారులను ఆదేశించడం జరిగినది .ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చక్కటి వాతావరణం లో జరుపుకునేందుకు వీలుగా అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగినది అని పి ఏ సి చైర్మన్ గాంధీ పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించి మన యొక్క పర్యావరణాన్ని కాపాడుకుందాం మరియు చెరువులను



కలుషితం చేయకుండా వీలైనంత వరకు మట్టి వినాయకులను మన యొక్క స్వగృహం ప్రాంగణంలో నే నిమర్జనం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము అని , అదేవిధంగా పర్యావరణ హితం మట్టి గణపతులను పూజించాలని ఈ విషయంలో మహిళలు ముందుండాలని, ప్రతి ఒక్కరికి అవగహన కలిపించాలని, మట్టి వినాయకులను పూజించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. అదేవిధంగా భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని సమాజ హితం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణ హితం ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన వినాయక విగ్రహాల ద్వారా చెరువులు కలుషితం అవుతాయి అని ,పర్యావరణ సమతుల్య త దెబ్బ తింటుంది అని కావున భావితరాలను దృష్టిలో పెట్టుకొని మట్టి వినాయక విగ్రహాలను ప్రతి ఒక్కరు తప్పకుండా పూజించి పర్యావరణంను పరిరక్షించాలని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు మరియు కార్యకర్తలు ,భక్తులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# డబ్బు కోసం కిడ్నాప్ డ్రామా

**ఇద్దరు యువకులను అరెస్ట్ చేసిన మట్వాడ పోలీసులు.**

**వరంగల్ అక్షిత బ్యూరో:**

వరంగల్ నగరంలో సంచలనం కలిగించిన యువకుడి కిడ్నాప్ నాటకం పోలీసుల దర్యాప్తులో బయటపడింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన ఇద్దరు యువకులు డబ్బు కోసం తామే కిడ్నాప్ అయ్యామని చూపిస్తూ కుటుంబ సభ్యులను బెదిరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. అప్పుల బాధలో ఏమి చేయాలో తెలియక తనకు తానే కిడ్నాప్ చేయించుకొని డబ్బులు డిమాండ్ చేసిన యువకుడు.లక్షల్లో అప్పులు చేసిన ఇద్దరు స్నేహితులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ చివరికి పది లక్షల రూపాయల కోసం కుట్ర పన్నారు. తాము కిడ్నాప్ అయ్యామంటూ ఇంటికి కాల్స్ చేసి డబ్బులు ఇవ్వకపోతే ప్రాణం తీస్తారని బెదిరించారు.హోటల్‌లో దాక్కున్న నిందితుల పట్టివేత.పక్కా సమాచారం అందుకున్న వెంటనే మట్వాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. హంటర్ రోడ్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో దాక్కున్న నిందితులను పట్టుకుని విచారణ జరిపారు. ఈ విచారణలో వారిద్దరి పన్నాగం




బట్టబయలయ్యింది. ప్రజలకు పోలీసుల హెచ్చరిక..ఈ సందర్భంగా మట్వాడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ “ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ఉండేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద వ్యక్తులు, చర్యలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి” అని సూచించారు. వరంగల్ పట్టణంలో వెలుగు చూసిన ఈ ఘటన సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది.

## బేడా బుడగ కుల ధృవీకరణ పత్రాల కోసం కామా రెడ్డి జాయింట్ కలెక్టర్ ను కలిసిన సంఘం సభ్యులు .

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి..**



కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆఫీసులో జాయింట్ కలెక్టర్ ని కలిసి రాష్ట్ర కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆఫీసులో జాయింట్ కలెక్టర్ ని కలిసి రాష్ట్ర బేడ బుడగ జంగం జన సంఘం అధ్యక్షులు సిరిపాటి వేణు రాష్ట్ర ఉపాధ్యక్షులు పస్తం పరశురాం, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పత్తి బసవ శివ మరియు రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాన రాసి గిరిని వెంకటి ఆధ్వర్యంలో బేడ బుడగ జంగాల కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కొరకై వారిని కలవడం జరిగింది కామారెడ్డి జిల్లాలో కోసంగిలు లేరని కేవలం బేడా బుడగ జంగాలు మాత్రమే ఉన్నారని తెలపడం జరిగింది ఇదే విషయంపై గోసంగిలు లేరని రాష్ట్ర గోసంగి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లెల సాయిచరణ్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు తూర్పాటి హనుమంతు , జేఏసీ వైస్ చైర్మన్ తూర్పాటి యాదయ్య గగనం మంతప్ప అధ్యక్షుల వారి ఆధ్వర్యంలో బేడ బుడగ జంగాల కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కొరకై కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు తూర్పాటి హనుమంతు జేఏసీ వైస్ చైర్మన్ తూర్పాటి యాదయ్య గగనం వెంకటస్వామి గగనం మంతప్ప లతో పాటు బి జె హెచ్ పి ఎస్ వ్యవస్థగా అధ్యక్షులు శ్రీపాటి శ్రీనివాస్ బి జే హెచ్ పి ఎస్ గౌరవ అధ్యక్షులు తూర్పాటి శ్రీనివాస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పాటి చిన్నకోటయ్య బి జె హెచ్ ఆర్ ఎస్ కోశాధికారి రామకృష్ణ బి జే హెచ్ ఆర్ ఎస్ ఉపాధ్యక్షులు గగనం వెంకటస్వామి బి జె హెచ్ ఆర్ ఎస్ అశ్వ జమ్మన్న బిజెపి అధ్యక్షులు మరియు కామారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు సాయిలు , ముఖ్య సలహాదారులు కల్లెం లక్ష్మీపతి కల్లెం రవి అల్లం పండరి అల్లం శ్రీను వివిధ గ్రామ సంఘ పెద్దలు మరియు సంఘస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యాస భాషలకు ప్రతీక.. కాళోజీ

**మిర్యాలగూడలో ఘనంగా కాళోజి జయంతి**

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**



నిజాం నిరంకుశ పాలనను నిలువెత్తున తూర్పర పట్టిన గళం, ఒక్కో అక్షరాన్ని ఆయుధంగా మలిచిన నిత్య సత్యాగ్రహ సమరశీలి శ్రీ కాళోజీ నారాయణరావు 111వ జయంతి మిర్యాలగూడలో మంగళవారం ప్రభుత్వ, ప్రభుత్వయేతర సంస్థల్లో నిర్వహించారు. స్థానికసబ్ కలెక్టరేట్ లో ఏఓ శ్రీనివాస్ శర్మ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.సురేష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రజినీకాంత్, ఎస్ఎ మతీన్, ఆర్ఐ కృష్ణయ్య, జెఎలు మృదుల, లలిత, జీపీఓలు మండల పరిశత్ లో ఎంపిడిఓ ఎం. శేషగిరి శర్మ, సూపరింటెండెంట్ పి. కరుణాకర్ రావు, ఎస్ఎ పాషా, ఇజిఎస్ ఈసీ కళావతి, శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ కెఎన్ఎం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం. భీమార్జునరెడ్డి తదితరులు నివాళులర్పించారు. గ్రంథాలయంలో ముఖ్యఅతిథి విశ్రాంత ఉపాధ్యాయులు, సాహితీవేత్త కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ కాళోజి విశిష్టతను, వర్తమాన అంశాలపై , సమాజం కోసం సమాజ చైతన్యం కోసం కాళోజీ ఎలా ఆవేదన చెందారో వివరిస్తూ తెలంగాణ భాష ,యాస ఆవశ్యకతను గ్రంథాలయ పాఠకులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కుమ్మరికుంట్ల సుధాకర్, శ్రీను,సునీల్, అనిల్,అరవింద్ ,ప్రమోద్, ప్రవీణ్, సంజయ్, చంద్రశేఖర్, సతీష్, వినోద్, సంపత్, మహేష్, కొటేష్, లక్ష్మణ్, స్వప్న, సంధ్య, మమత, శ్రీ వల్లి, లక్ష్మీ, మరికొందరు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి



**నాగారం అక్షిత న్యూస్ :-**

ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలను మండల పరిధిలోని పసునూరు తెలంగాణ మోడల్ స్కూల్ లో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా తెలంగాణ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ బల్గూరి చంద్రబాబు మాట్లాడుతూ ప్రజాకవి కాలోజి నారాయణరావు తెలంగాణ భాష సాంస్కృతులకు ప్రతీక, ఆయన అడుగుజాడల్లో నడిచి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు, విద్యార్థులు, సాంస్కృతిక సంఘాలు, ఆయన రచనలను చదివి చైతన్య పరులయ్యారని తెలిపారు. ప్రజలు జీవిత చరిత్రను గుర్తు చేసుకుంటూ ఆయన ఆదర్శాలను ఆచరణలో పెట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు లింగరాజు, సోమసుందర్, నరేష్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఫ్రేయర్ ఎనర్జీ సోలార్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ ప్రారంభం




**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

దేశంలో అగ్రగామి రూఫ్‌టాప్ సోలార్ సంస్థ ఫ్రేయర్ ఎనర్జీ ఖమ్మం నగరంలో తొలి సోలార్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ ను ప్రారంభించింది. ఇప్పటి వరకు సంస్థ తెలంగాణలో 3.2 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులు అమలు చేసింది. అందులో 0.85 మెగావాట్లు ఖమ్మంలోనే ఉన్నాయి.రాష్ట్ర ప్రభుత్వం 2030 నాటికి 12,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఫ్రేయర్ ఎనర్జీ 2027 నాటికి తెలంగాణలో 15 మెగావాట్ల సామర్థ్యం సాధించేందుకు ప్రణాళికలు రూపొందించింది.ఈ సెంటర్ ద్వారా ప్రజలు సోలార్ టెక్నాలజీని ప్రత్యక్షంగా చూసి అర్థం చేసుకొని నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని సహ వ్యవస్థాపకురాలు రాధికా చౌదరి తెలిపారు.ఇప్పటికే దేశవ్యాప్తంగా 100 మెగావాట్లకు పైగా రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు అమలు చేసిన ఫ్రేయర్ ఎనర్జీ త్వరలో మరిన్ని నగరాల్లో ఇలాంటి సెంటర్లను ఏర్పాటు చేయనుంది.

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY



# ఖమ్మంలో కాళోజీ విగ్రహం నెలకొల్పాలి

**-ములక సురేష్**

**ఖమ్మం/అక్షిత బ్యూరో :**



ఖమ్మంలో ట్యాంక్ బండ్ వద్ద ప్రజాకవి కాళోజి విగ్రహాన్ని ప్రభుత్వమే నెలకొల్పాలని తెలంగాణ చైతన్య వేదిక కన్వీనర్ ములక సురేష్ అన్నారు ఈరోజు కాళోజి 111 వ జయంతిని పురస్కరించుకొని వేదిక ఆధ్వర్యంలో స్థానిక అమరవీరుల స్తూపం వద్ద జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిది అన్న కాళోజి ఊహ తెలిసిన దగ్గర నుండి ఊపిరి పోయేవరకు తెలంగాణలో జరిగిన అన్ని ఉద్యమాలలో కేవలం భాగస్వామి మాత్రమే కాకుండా తమదైన పద్ధతిలో ఉద్యమాలకు నాయకత్వం వహించాడని ప్రజల గొడవను తన గొడవగా రాసుకుని ప్రాచుర్యం పొందాడని అన్యాయాన్ని సహించలేక అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడని స్పష్టం చేసిన మానవ హక్కుల వాది అని దేశ రెండవ అత్యున్నత అవార్డు పద్మ విభూషణ్ కు వన్నెతెచ్చిన మహామనిషి కాళోజి అని ఆయన అన్నార.ఈ సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కే సీతారాములు డాక్టర్ ఆంజనేయులు ఐలయ్య దశరథ రామ్ బుక్కా సత్యనారాయణ కామిశెట్టి శ్రీనివాస్ ఉదయభాస్కర్ నాగరాజు పురుషోత్తం తీగల రాము సత్యనారాయణ రేలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై సిపిఐ పోరాటానికి సిద్ధం

**రైతులకు సకాలంలో యూరియాను అందించాలి ...**

**బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్న షాపులపై చర్యలు తీసుకోవాలి ..**

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి ...**

**అక్షిత న్యూస్ అనంతగిరి**




సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో మండల సిపిఐ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు యూరియాను సహకార సంఘాల ద్వారా సకాలంలో అందించాలని, బ్లాక్ మార్కెట్లో యురియాను ఎక్కువ ధరకు అమ్ముతున్న షాపులపై తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజా సమస్యలపై సిపిఐ నిరంతరం పోరాడుతుందన్నారు. గత కొన్ని రోజులుగా రైతులు యురియా కోసం హరిగోసపడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతుల పక్షాన సిపిఐ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. అదేవిధంగా డిసెంబర్ 26 సిపిఐ ఆవిర్భావ వేడుకలు ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సెప్టెంబర్ 17 వారోత్సవాలలో భాగంగా 16వ తేదీ నాడు అనంతగిరి మండలంలో కార్యక్రమం నిర్వహించాలని 16వ తేదీ మధ్యాహ్నం సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ కోదాడలో జరుగునున్నదని అట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కోటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎరసాని రవి, నాగబద్రం, దేగా వీరన్న, బత్తిని వీరబాబు, షేక్ మీరంబి , పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

**ఎంఈఓ సుంకోజు భాస్కర్**

**వలిగొండ /అక్షిత న్యూస్ :**



మండల స్థాయి క్రీడా పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. అండర్-17,14 క్రీడా పోటీలు మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి సుంకోజు బాస్కర్ ప్రారంభించారు.ఈ పోటీలలో మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ రహీసున్నీసబేగం తెలిపారు.ఖో,ఖో,లో బాలికలకు మొదటి బహుమతి,ఖో,ఖో బాలురకు మొదటి బహుమతి,వాలిబాల్ బాలికలకు మొదటి బహుమతి,కబడ్డి బాలురు ద్వీతీయ బహుమతి,ఖో,ఖో బాలికలు ద్వీతీయ బహుమతి పొందారు.అదే విధంగా ఏ లోకేష్ రన్నింగ్ లో 100,200 మీటర్స్ లో మొదటి బహుమతి,ఆర్ మైథిలి రన్నింగ్ 100 మీటర్స్ లో ద్వీతీయ బహుమతి పోందారు.గెలుపొందిన విద్యార్థులను మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ జి ఐలయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

# వెట్టి చాకిరితో బాల్యం ఛిద్రం..

**బాల్యం బుగ్గిపాలు**

**భావిభారత పౌరులుగా ఎదగాల్సిన బాలలు**

**బాల్యంలోనే కార్మికులుగా మగ్గిపోతున్నారు.**

**భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి, సాయి హొటల్ లో ఘటన**

**భువనగిరి, అక్షిత న్యూస్ :**




భావిభారత పౌరులుగా ఎదగాల్సిన బాలలు, బాల్యంలోనే కార్మికులుగా మగ్గిపోతున్నారు. కుటుంబ పోషణభారమై పిల్లలను చదివించే ఆర్థిక స్తోమతలేక పనిలోకి దించుతున్నారు. మరికొందరు బాలలు తల్లిదండ్రుల ఆదరణలేక, తల్లిదండ్రులు లేని అనాథలు దిక్కులేని పరిస్థితుల్లో బాలకార్మిక వ్యవస్థలోకి వెళుతున్నారు. ఇటువంటి బాలల జీవితాలను బాల్యంలోనే మగ్గిపోనీయకుండా వారిని చేరదీసి మంచి చదువును అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వాలు బాలకార్మిక చట్టాలను తీసుకువచ్చింది.ఆ చట్టాలను అంత పకడ్బందీగా సాగడంలేదనే విమర్శలున్నాయి. అనాథ బాలలు,బాల కార్మికులను గుర్తించి వారికి ఆశ్రయం కల్పించి చదువు,హాస్టల్ వసతి కల్పించినా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యం కావడం లేదు.ప్రతి ఏడాది చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,పోలీసులు,చైల్డ్ లైన్ ప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఇటుక బట్టీలు, హొటళ్లు, రెస్టారెంట్,ఇతర పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించి కూలీలుగా పని చేస్తున్న బాలబాలికలను గుర్తించి వారి కుటుంబ సభ్యులు, బంధువులతో స్వస్థలాలకు పంపిస్తున్నారు. తాజాగా మంగళవారం భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఓ హొటల్ లో పని చేస్తున్న సుమారు 10 సంవత్సరాల బాలిక,తాగిన సిసలు,గ్లాసులు తీస్తున్న దృశ్యాలు కెమెరాకు చిక్కాయి.



# ఉపరాష్ట్రపతి సిపీ రాధాకృష్ణన్‌కు

# శుభాకాంక్షలు

**మొయినాబాద్, అక్షిత న్యూస్ :**



చిలుకూరు బాలాజీ దేవస్థానం తరఫున మా భక్తులందరి, అర్చకుల తరఫున సిపీ రాధాకృష్ణన్ కి భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం.గత సంవత్సరము చిలుకూరు బాలాజీని దర్శించిన సిపి రాధాకృష్ణన్ .... బాలాజీ వెంకటేశ్వర స్వామి దివ్యమైన ఆశీర్వాద బలంతో నేడు ఉపరాష్ట్రపతిగా ఎన్నిక య్యారు. జనసేవకు మీరు సమర్పించిన జీవితం, ధర్మం, నైతికత, భారతీయ సంస్కృతి పట్ల మీ అంకిత భావం దేశానికి గర్వకారణం. మీరు చేపట్టబోయే బాధ్యతలు దేశ ప్రజాస్వామ్యానికి మరింత గౌరవాన్ని తీసుకొస్తాయని మేము విశ్వసిస్తున్నాం. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ,

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే దిశగా మీరు ముందుకు సాగాలని శ్రీ బాలాజీ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ మీతో ఉండాలని ప్రార్థిస్తున్నాం. మీ పదవీ కాలం దేశ యువతకు ప్రేరణగా నిలవాలని, రాజనీతిలో నీతి, నిజాయితీ, మరియు జాతీయ ఐక్యతకు మార్గదర్శకంగా నిలవాలని ఆశిస్తున్నాం.

# సిగాచి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**ప్రొఫెసర్ కోదండరాం**

**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి.**




సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం లోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, పరిహారం వెంటనే బాధిత కుటుంబాలకు చెల్లించాలని రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా తెలంగాణ ఉద్యమకారులు,ప్రొఫెసర్ కోదండరామ్ డిమాండ్ చేశారు. మంగళ వారం సంగారెడ్డి జిల్లా ముత్తంగి పిఎస్ఆర్ గార్డెన్ లో సిగాచి పేలుడు బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన పూర్తి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.పారిశ్రామిక ప్రమాదాలు,యాజమాన్యం నిర్లక్ష్యం, ప్రభుత్వ సంస్థల వైఫల్యం అనే అంశాలపై సమావేశం కొనసాగింది.సిగాచి పేలుడు బాధితులకు ప్రకటించిన పూర్తి పరిహారం ఒకే విడతలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ సైన్ టిస్ట్ పర్ పీపుల్ (ఎస్ఎఫ్పి), మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్), తెలంగాణా పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిపిజెఎసి) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారులు,ప్రొఫెసర్ కోదండరాం,సైన్టిస్ట్ బాబురావు, న్యాయవాది వసుధ నాగరాజు, టిపిజెఏసీ కన్వీనర్ వై.అశోక్ కుమార్, జాతీయ కన్వీనర్ ఎంవిఎఫ్ ఆర్.వెంకట్ రెడ్డి, ఏపీసిఆర్ డాక్టర్ ఉస్మాన్, ఎం ఎస్ ఐ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్, ఎన్ఏపిఎం, వివిధ కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సిగాచి బాధిత కుటుంబాలకు తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.సిగాచి కంపెనీలో జరిగిన ప్రమాద సంఘటన బాధాకరం అన్నారు.దేశంలోనే రెండవ అతి పెద్ద ప్రమాద సంఘటన అని తెలిపారు.తక్షణమే బాధ్యత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్స్ మాఫియా ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలి

**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు**

**డ్రగ్స్ ను నిర్మూలిద్దాం సమాజాన్ని కాపాడుకుందాం :జిల్లా అధ్యక్షులు చింతల రమేష్**

**ఖమ్మం/అక్షిత బ్యూరో :**




డ్రగ్స్ మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ కార్యదర్శి బొడ్డు మధు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ దీనిపై ప్రభుత్వాలు అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు దీనిని డివైఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుంది.రెండు రోజుల క్రితం చర్లపల్లి ఇండస్ట్రియల్ ప్రాంతంలో డ్రగ్స్ ముఠా బయటపడింది దాదాపు 12 వేల కోట్ల విలువగల ప్రమాదకరమైన డ్రగ్స్ ను స్వాధీనం చేసుకొని 13 మందిపై కేసు నమోదు చేశారు. ఈ డ్రగ్స్ ముఠాను డ్రగ్స్ ను పట్టుకున్నందుకు మహారాష్ట్ర పోలీసులకు ఖమ్మం జిల్లా డివైఎఫ్ఐ కమిటీ తరపున అభినందనలు తెలియజేస్తున్నాము. ఈ డ్రగ్స్ రాకెట్ కు సంబంధించిన నిందితులందరినీ పట్టుకొని కఠినంగా శిక్షించాలని తెలిపారు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని మద్యానికి గంజాయి కి బానిసలు కావద్దని కోరారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వమే క్యాంపియన్ చేసి ప్రజలను చైతన్యం చేయాలని అధికారులకు తెలిపారు రేపులు మర్డర్లు అత్యాచారాలు కిడ్నాపులు నిరుద్యోగం అప్పులవడం ఆత్మహత్య లు అన్నిటికీ మూల కారణం కేవలం డ్రగ్స్ (మత్తు) మాత్రమే అని తెలిపారు.

తెలంగాణ ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చింతల రమేష్ జిల్లా ఉపాధ్యక్షులు రావులపాటి నాగరాజు జిల్లా కమిటీ సభ్యులు కొంగర నవీన్ హవేలీ నాయకులు మహేష్ మరియు ఖమ్మం డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కనుకు యాకయ్య పార్థివదేహానికి నివాళులర్పించిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు

**నాగారం అక్షిత న్యూస్ :-**



మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో కనుక యాకయ్య పార్థివ దేహానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు పుష్పమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కనుకు యాకయ్య గ్రామంలో నిస్వార్థ, నిజాయితీ గల రాజకీయవేత్త అని కొనియాడారు. గ్రామ పెద్దగా గ్రామ ప్రజలతో మమేకమై మంచి, చెడుల విషయాలలో పక్షపాతంతో కాకుండా సమిష్టిగా అట్టి సమస్యలను పరిష్కరించేవాడని తెలిపారు. ఆయన ఆదర్శం పలువురికి దిక్సూచి అని అన్నారు. ఆయన మరణం గ్రామ ప్రజలకు తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు కలెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని అంబయ్య, జంగిలి ఉపేందరావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ అశోక్ రెడ్డి, కూరం వెంకన్న, దోమల బాలమల్లు, మాజీ సర్పంచ్ లు, మొల్కపురి పుల్లయ్య, ఈరేటి అంజి, సత్తిరెడ్డి, దేవా, సరస్వతి వెంకన్న, నాయకులు జంపాల రాజు, జాన్ వెస్లీ, గట్టు రవి, సతీష్, సట్టు వీరయ్య, బుక్క రాజు సోమయ్య, సంతు, వంగూరి లింగమల్లు, కలెట్లపల్లి రాములు, వెంకన్న, నవీన్, సోమన్న, సూరన్న, తీగుళ్ల వెంకన్న, కృష్ణమూర్తి, సోమయ్య, శ్రీనివాస్, జంపాల జయరాములు, జనార్ధన్, ఆకారపు సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ సేవలు చిరస్మరణీయం

**ఎంపీడీవో జలంధర్ రెడ్డి**

**వలిగొండ/అక్షిత న్యూస్:**



ప్రజా చైతన్యమే లక్ష్యంగా మహాకవి కాళోజీ నారాయణ రావు రచనలు సాహితీవేత్తగా సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని వలిగొండ ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి అన్నారు. ప్రజాకవి స్వర్గీయ కాళోజీ నారాయణరావు 111 వ జయంతి సందర్భంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ జీవిత చలనశీలి కాళోజి అని, పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణకిచ్చిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి అని అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావును యువత ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్టులను పూర్తి చేయాలి

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గంలోని దున్నపోతుల గండి ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ కోరారు. మంగళవారం హైదరాబాద్ ఎర్రమంజిల్ జలసౌదలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కె. వెంకట్ రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రవహించే వజీరాబాద్ మేజర్, ముల్కల కాల్వ మేజర్ కాలువలు అన్ని చాలా చోట్ల దెబ్బ తిన్నాయని. కాలువ మరమ్మత్తు పనులను కూడా త్వరగా చేయాలని కోరారు.

# స్వాతంత్ర్య సమరయోధురాలు నర్సమ్మకు నివాళి



**వలిగొండ /అక్షిత న్యూస్:**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో స్వాతంత్ర సమరయోధురాలు వడ్డెమాని నర్సమ్మ(96) సోమవారం రోజున మరణించడం జరిగింది. ఆమె పార్థివ దేహానికి గ్రామ సిపిఎం, బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ నాటి స్వాతంత్రోద్యమ కాలంలో రజాకారులను తరిమికొట్టడంలో నర్సమ్మ పాత్ర ఎంతో ఉన్నదని వారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by Mathangi Guruvaiah, and Printed at Spoorthi Publications, H.No.7-1059/1, Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana, and Published at H.No.7-1059/1,Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana. Editor : Mathangi Guruvaiah, Email : akshithadaily@gmail.com, Cell: 9000556444 RNI NO.APTEL/2011/37073